

జూలై 1న సీఎం చంద్రబాబు కొవ్వూరు రాక

సీఎంవో నుంచి సమాచారం
ఏర్పాట్ల కోసం అధికారులను అప్రమత్తం చేసిన కలెక్టర్

రాజమహేంద్రవరం/కొవ్వూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వచ్చే నెల 1న కొవ్వూరు నియోజకవర్గంలో పర్యటించనున్నారు. చంద్రబాబు స్వయంగా ఒక కుటుంబానికి ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్ పంపిణీ అందజేస్తారు. అదే సమయంలో పీ4 పథకం కింద మార్గదర్శి కోసం అక్కడ సభ నిర్వహిస్తారు. ఇదే మండలంలోని దొమ్మేరు లేదా కాపవరం, తాళ్లపూడి మండలం మలకపల్లి గ్రామాల్లో గ్రామ సభ ఉండే అవకాశం ఉంది. ఈనేపథ్యంలో తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను అప్రమత్తం చేశారు. శనివారం రాత్రి సీఎంవో నుంచి ముఖ్య కార్యదర్శి పీఎస్ ప్రద్యుమ్న, ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త పెందుర్తి వెంకటేష్, కలెక్టర్ ప్రశాంతితో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. సీఎం ప్రోగ్రాం ఏర్పాట్లు, ఇతర అంశాలపై వారు దిశానిర్దేశం చేశారు. పెన్షన్ పంపిణీ, మార్గదర్శి కుటుంబాలతో ముఖాముఖీ, భద్రతా ఏర్పాట్లు, గ్రామసభ తదితర అంశాలపై రూట్‌మ్యాప్ సిద్ధం చేసుకోవాలని సూచించారు. కాగా సీఎం పర్యటన నేపథ్యంలో అధికారులు శనివారం రాత్రి పలు ప్రాంతాల్లో పర్యటించారు. కొవ్వూరులోని వాత్సల్య వృద్ధాశ్రమాన్ని జేసీ ఎస్.చిన్నరాముడు, ఆర్డీవో రాణి సుస్మిత సందర్శించారు. అనంతరం దొమ్మేరు, మలకపల్లి గ్రామాల్లో సీఎం పర్యటనకు సంబంధించి కొన్ని స్థలాలను పరిశీలించారు.

పర్యాటక వెలుగు



టెంట్ సిటీ, బోట్ ఫెస్టివల్ (నమూనా చిత్రాలు)



ప్రకృతి అందాలకు.. సహజ సౌందర్యాలకు నెలవు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా. ఒకపక్క వయ్యారాలు పోతూ రారమ్మని పిలిచే గోదావరి.. మరోపక్క తనివి తీరని తీరం అందాలు.. వీటి నడుమ ఒంపుసొంపుల మడ అడవులు.. పచ్చని కొబ్బరి చెట్లు..మండువా లోగిళ్లు.. పంచా రామాల దివ్యక్షేత్రాలు.. ఇలా ఒకటేంటి ఉమ్మడి జిల్లా అందాలు వర్ణించడానికి మాటలు చాలవు.. ఇన్ని అందాలున్న ఉమ్మడి జిల్లాలో పర్యాటకుల తాకిడి ఇప్పటికీ అంతంతమాత్రమే. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో పర్యాటకరంగానికి కొత్త కళ తెచ్చేందుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. తాజాగా రూ.737 కోట్లతో రెండు సంస్థలతో ఒప్పందం కుదుర్చుకోగా, పర్యాటకశాఖ తరఫున బోట్ ఫెస్టివల్, బీచ్ ఫెస్టివల్, టెంట్ హౌస్‌లతో కట్టిపడేసేందుకు సన్నాహాలు మొదలుపెట్టింది.

- ఉమ్మడి జిల్లాలో పర్యాటక, ఆతిథ్య రంగానికి కొత్త కళ
- సర్కారు శ్రద్ధతో హోటళ్లు, రిసార్టుల నిర్మాణానికి కంపెనీల రాక
- కోనసీమలో రూ.650 కోట్లతో తాజ్ చైతన్య సంస్థ రిసార్టులు, అమ్యూజ్‌మెంట్ పార్కు
- కాకినాడలో రూ.87 కోట్లతో తాజ్ ఎస్వీఎస్ సంస్థ హోటల్, కన్వెన్షన్ సెంటర్
- ప్రభుత్వంతో ఒప్పందాలు పూర్తి చేసుకున్న సంస్థలు
- అటు కాకినాడలో బీచ్ ఫెస్టివల్, కోనసీమలో బోట్ ఫెస్టివల్‌కు ఏర్పాట్లు
- రాజమహేంద్రవరంలో పర్యాటకులకు కొత్త అనుభూతి ఇచ్చేలా టెంట్ సిటీ

(కాకినాడ- ఆంధ్రజ్యోతి)

విశాఖ తర్వాత రాష్ట్రంలో పర్యాటకరంగానికి అత్యంత ఆదరణ ఉన్న జిల్లా ఉమ్మడి తూర్పు గోదావరి. కానీ గత వైసీపీ ప్రభుత్వం అరాచక పాలనతో పర్యాటక రంగం పూర్తిగా పడకేసింది. కొత్తగా సదుపాయాల కల్పన మాటేమోగానీ ఉన్న సదుపాయాలను గాలికి వదిలేయడంతో పూర్తిగా ఎక్కడికక్కడ పర్యాటక ప్రదేశాలు కొరగాకుండా పోయాయి. అటు పర్యాటక పెట్టుబడులు అయితే ఆ ప్రభుత్వ హయాంలో చిల్లిగవ్వ కూడా రాలేదు. ఈ నేపథ్యంలో గ్రహణం పట్టిన పర్యాటక రంగానికి కొత్త కళ తెచ్చేలా సీఎం చంద్రబాబు ఊపిరిలూదుతున్నారు. అద్భుత అవకాశాలున్న ఉమ్మడి జిల్లాలో పెట్టుబడులు ఆహ్వానిస్తూనే.. పర్యాటకులను అలరించేలా ప్రభుత్వం తరఫున సైతం రకరకాల ఈవెంట్లను నిర్వహించేందుకు కార్యాచరణ చేపట్టారు. అందులో భాగంగా ఈ రంగంలో పెట్టుబడులు పెట్టేవారికి రకరకాల ప్రోత్సాహకాలతో పెద్దపీట వేయాలని నిర్ణయించారు. ఈమేరకు ముందుకు వచ్చిన కంపెనీలతో అమరావతిలో శుక్రవారం నిర్వహించిన పర్యాటక సదస్సులో ప్రభుత్వంతో ఒప్పందం కూడా కుదుర్చుకున్నారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాకు రూ.737 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ప్రధానంగా కోనసీమ జిల్లాలో రూ.650 కోట్ల పర్యాటక పెట్టుబడులు పెట్టడానికి తాజ్‌చైతన్య ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థ ముందుకు వచ్చింది. ఆ సంస్థ శుక్రవారం పర్యాటక శాఖతో ఒప్పంద పత్రాలు మార్చుకుంది. ఈ పెట్టుబడులతో అమలాపురం, చుట్టుపక్క ప్రాంతాల్లో రిసార్టులు, అమ్యూజ్‌మెంట్‌పార్కు నిర్మించనున్నట్టు ఒప్పంద పత్రాల్లో పేర్కొన్నారు. వాస్తవానికి కేరళ తరహాలో ఉండే కోనసీమ అందాలు చూసేందుకు ఎందరో పర్యాటకులు ఇక్కడకు వస్తున్నారు. కానీ సరైన స్టార్ హోటళ్లు, ఎంటర్‌టైన్‌మెంట్ లేదు. ఈ నేపథ్యంలో వీటిని అందుబాటులోకి తీసుకురావడానికి తాజ్ చైతన్య ఇన్‌ఫ్రా కంపెనీ ముందుకు వచ్చింది. ఈ సదుపాయాలు అందుబాటులోకి వస్తే సుదూర ప్రాంతాల నుంచి కోనసీమకు వచ్చే పర్యాటకులు కొన్నిరోజులు ఇక్కడే గడుపుతారని ప్రభుత్వం భావిస్తోంది. తద్వారా రకరకాల వ్యాపార లావాదేవీలకు ఊతం అందడంతోపాటు స్థానికులకు సైతం ఆదాయం వస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. అలాగే కాకినాడలో రూ.87 కోట్లతో స్టార్‌హోటల్ గదులు, వాటితో పాటు భారీ కన్వెన్షన్ సెంటర్ నిర్మాణానికి తాజ్ ఎస్వీఎస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. ప్రస్తుతం కాకినాడలో స్టార్‌హోటళ్ల సంఖ్య చాలా తక్కువగా ఉన్నాయి. అటు భారీ ఈవెంట్ల నిర్వహణకు సరైన కన్వెన్షన్ సెంటర్ లేదు. ఈ నేప థ్యంలో హైదరాబాద్ హైటెక్స్ తరహాలో కన్వెన్షన్ సెంటర్ నిర్మాణానికి ఆ కంపెనీ ముందుకు వచ్చింది. కోనసీమలో నిర్మించే రిసార్టులు, అమ్యూజ్‌మెంట్ పార్కు ద్వారా వెయ్యి మందికి, కాకినాడలో నిర్మించే హోటల్, కన్వెన్షన్ సెంటర్ ద్వారా 500 మందికి ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించబడతాయి. అలాగే ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో 13 చోట్ల గోదావరి తీరం, గోదావరి కాలువల వెంబడి అడ్వంచర్ టూరిజం సదుపాయాలకు ప్రైవేటు కంపెనీల నుంచి ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించింది.

అటు టెంట్ సిటీ.. ఇటు పండగలు..

ఒకపక్క పెట్టుబడులు రాబట్టి ఉమ్మడి జిల్లాలో పర్యాటక సదుపాయాలు, ఆహ్లాదం పెంచడం ఒకెత్తుకాగా, పర్యాటకశాఖ తరఫున సైతం ప్రభుత్వం పలు టూరిస్టు కార్యకలాపాలు నిర్వహించాలని నిర్ణయించింది. అందులోభాగంగా త్వరలో కోనసీమ జిల్లాలో గోదావరి బోట్ ఫెస్టివల్ నిర్వహించబోతోంది. వందలాది బోట్లకు పడవ పోటీలు, అందులో సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాలు ఏర్పాటు చేయడానికి క్యాలెండర్ రూపొందించింది. అలాగే కాకినాడ బీచ్ ఫెస్టివల్‌ను మూడు రోజులపాటు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు కసరత్తు చేస్తోంది. ఫుడ్ ఫెస్టివల్, గేమ్స్, సాహస జలక్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, మ్యూజికల్ నైట్స్ వంటివి ఏర్పాటుచేయబోతోంది. అలాగే దిండిలో హౌస్‌బోట్స్, ఫ్లోటింగ్ రెస్టారెంట్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. నదిలో తిరుగుతూ, ఒకచోట ఆగుతూ అందులో కుటుంబంతో కలిసి డిన్నర్, లంచ్ చేసేలా ఆధునిక, విలాసవంతమైన బోట్లను రప్పిస్తోంది. ఇదికాకుండా 12 మంది పర్యాటకులు కూర్చుని ప్రయాణించేలా హైస్పీడ్ ఎఫ్ఆర్‌పీ బోట్ క్రూయిజ్‌ను నది, సముద్రంలో తిప్పడానికి వీలుగా ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇదంతా ఒకెత్తయితే రాజమహేంద్రవరం నగరంలో గోదావరి తీరాన 40 గదులతో టెంట్ సిటీని ఏర్పాటు చేయబోతోంది. సాధారణంగా ఇక్కడకు వచ్చే పర్యాటకులు గోదావరికి దూరంగా ఎక్కడో హోటళ్లలో బస చేస్తారు. ఇందుకు వేలల్లో ఖర్చవుతుంది. మరోపక్క రద్దీ రోజుల్లో హోటల్ గదులు కూడా దొరకవు. ఈనేపథ్యంలో తక్కువ ఖర్చు.. ఎక్కువ గోదావరి అందాలు చూసేలా 40 గదులు నిర్మించాలని ప్రతిపాదించింది. ఇందులో పడక గదులు, వాష్‌రూంలు, ఎంటర్‌టైన్‌మెంట్ కూడా అందుబాటులో ఉంటుంది. వాస్తవానికి ఈటెంట్ సిటీ అయోధ్య, గుజరాత్‌లోని కెవాడియా ప్రాంతాల్లో ప్రసిద్ధి చెందాయి. దూరప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు అక్కడి పర్యాటక శాఖ ఈటెంట్ సిటీల్లో బస అందుబాటులోకి తీసుకువచ్చింది. దీన్ని అధ్యయనం చేసిన రాష్ట్ర పర్యాటక శాఖ బాపట్ల జిల్లా సూర్యలంక బీచ్ వద్ద రూ.98 కోట్లతో 50 టెంట్ రూం సిటీని ఏర్పాటుకు నిర్ణయించింది. పర్యాటకులకు తక్కువ ధరల్లో అన్ని రకాల వసతులతో వీటిని ఇవ్వబోతోంది. అచ్చం ఇదే తరహాలో రాజమహేంద్రవరంలో కూడా ఈ తరహా టెంట్ సిటీని ఏర్పాటుచేయాలని నిర్ణయించింది.



'ధర' హాసం!

అరటితోపాటు కొబ్బరి మార్కెట్ ధరలు అనూహ్యంగా పుంజుకోవడంతో రైతుల ఆనందానికి అవధుల్లేవు. కర్పూర అరటి ధర గతంకంటే రెట్టింపు పలుకుతుండడం, ఆ రకం కర్పూర సాగు చేసిన రైతులకు పంట పండినట్టయింది. అలాగే కొబ్బరిలో కూడా ధరల పెరుగుదల రానున్న రోజుల్లో మరింత పుంజుకోవచ్చని అంచనా. ఇక కురిడీ కాయకు అద్భుత ధర పలుకుతోంది.

(అమలాపురం- ఆంధ్రజ్యోతి)

- అరటి, కొబ్బరి రైతుల్లో ఆనందం
- కర్పూర, చక్రకేళీ గెల రూ.600 పైనే
- ఉత్పత్తి తగ్గడంతో పెరిగిన డిమాండ్
- కొబ్బరికీ రికార్డు స్థాయిలో పెరుగుదల
- కురిడీ వెయ్యింటికీ రూ.27 వేలు
- పచ్చికాయ మాత్రం రూ.19వేల లోపే

కర్పూర.. గతంకంటే రెట్టింపు

ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని గోదావరి నదీ పరీవాహక లంక గ్రామాల్లో అరటి సేద్యం చేస్తున్న రైతులకు ఈసారి పంట పండినట్టయింది. రావులపాలెం అరటి మార్కెట్ నుంచి నిత్యం వేలాది కర్పూర, చక్రకేళీ సహా వివిధ రకాల అరటి ఉత్పత్తులు వివిధ రాష్ట్రాలతోపాటు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలకు ఎగుమతి అవుతున్నాయి. ప్రస్తుతం కర్పూర రకానికి మంచి డిమాండ్ ఉంది. ఈ ఏడాది జనవరిలో కర్పూర అరటి గెల రూ.120 నుంచి రూ.250 వరకు ధర పలికింది. మే, జూన్ నెలలో కర్పూర రకం గెల ఒక్కోటీ రూ.300 నుంచి రూ.600 వరకు ధర పలుకుతుండడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. చక్రకేళీ కంటే కర్పూర రకానికే ధర పెరిగింది. గతంలో కర్పూర రకానికి మార్కెట్ పూర్తిగా పడిపోవడంతో రైతులు ఆ రకం పంటపై పెద్దగా దృష్టిపెట్టలేదు. దాంతో సాగు తగ్గిపోయింది. ఈ కారణంగా కర్పూరానికి డిమాండ్ పెరిగింది. రావులపాలెం మార్కెట్ నుంచి నెలకు 7వేల నుంచి 8,500 వరకు అరటి గెలలు ఎగుమతి అయ్యేవి. జనవరి నెలలో మార్కెట్‌యార్డు నుంచి 9 వేల నుంచి 10 వేల వరకు అరటిగెలల విక్రయాలు జరిగేవి. ప్రస్తుతం కర్పూర రకం వినియోగం పెరగడంతో ఒడిశా, విశాఖపట్నం, హైదరాబాద్, ఖమ్మం వంటి ప్రాంతాలకు అరటి ఎగుమతులు పెరిగాయి. చక్రకేళీ అరటిగెల ప్రస్తుతం రూ.400 నుంచి రూ.700 వరకు ధర పెరగడంతో రైతులకు లాభసాటిగా మారింది. రానున్న శ్రావణ మాసం, వినాయకచవితి, పండుగల సీజన్‌లో మరింత ధరలు పెరిగే అవకాశం ఉంది.

రికార్డు స్థాయిలో కురిడీ ధరలు

కొబ్బరి రైతులకు ఈసారి దశ తిరిగిందనే చెప్పాలి. ధరల పెరుగుదల కొనసాగుతుండడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. దీనికితోడు నిల్వచేసిన కురిడీ కొబ్బరి ధరలు వెయ్యింటికీ రూ.27వేల వరకు ధర పలకడం రికార్డు నెలకొల్పింది. ప్రధానంగా ఇతర రాష్ట్రాల్లో కొబ్బరి ఉత్పత్తులు తగ్గిపోతుండడంతో గోదావరి జిల్లాల నుంచి ఎగుమతి అయ్యే ఉత్పత్తులకు మంచి డిమాండ్ లభిస్తోంది. పచ్చికాయ కొబ్బరి ధర వెయ్యి కాయ మాత్రం రూ.18వేల నుంచి రూ.19 వేల వరకు ధర పలుకుతున్నట్టు కొబ్బరి రైతులు చెబుతున్నారు. రానున్న శ్రావణమాసం, వినాయక చవితి వంటి పర్వదినాల సమయంలో వీటి ధరలు పెరుగుతాయని పేర్కొంటున్నారు. ముఖ్యంగా గోదావరి జిల్లాల నుంచి 50 లారీలకు పైగా మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాలకు ఎగుమతులు అవుతున్నాయి. అయితే గతంకంటే ప్రస్తుతం కోనసీమ జిల్లాలో కొబ్బరి ఉత్పత్తులు ధరలు పెరిగినప్పటికీ ఉత్పత్తులు మాత్రం తగ్గుముఖం పట్టడం రైతులను ఒకింత నిరాశకు గురిచేస్తోంది. ప్రస్తుతం కొత్త కొబ్బరి క్వింటాల్ రూ.23,500, రెండో రకం కొత్తకొబ్బరి రూ.20 వేలు, కురిడీ కొబ్బరి పాతరకంలో గండేరా వెయ్యి కాయ రూ.27 వేలు, గటగటా వెయ్యి రూ.25 వేలు,కురిడీ కొబ్బరి కొత్తరకంలో గండేరా వెయ్యికాయ రూ.25వేలు, గటగటా వెయ్యి రూ.23 వేలు ధర పలుకుతున్నాయి. నీటికాయ రూ. 18 వేల నుంచి రూ.19వేల మధ్య ధర పలుకుతోంది. మొత్తం మీద అరటి, కొబ్బరి ధరల పెరుగుదల రైతుల్లో ఉత్సాహాన్ని నింపింది.

సహకార సంఘాల రికార్డులను క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయండి : కలెక్టర్

రాజమహేంద్రవరం రూరల్, జూన్28 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల రికార్డులను క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం సహకార అభివృద్ధి కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని సహకార సంఘాల రికార్డులను తనిఖీలుచేసి కార్యకలాపాలు నిర్వహించని మనుగడలో లేని సొసైటీల విషయంలో ప్రభుత్వ మార్గదర్శకాలు, కోఆపరేటివ్ సొసైటీ నిబంధనల మేరకు చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు. నిబంధనలు పాటించకుండా, పనిచేయడంలో వైఫల్యం కలిగిన సొసైటీలను రద్దుచేసి, నగదు లావాదేవీలు, అనుబంధ రికార్డులు, ఇతర కార్యకలాపాలకు చెందిన రికార్డులు సీజ్ చేయాలని ఆదేశించారు. రికార్డులని పరిశీలించి తిరిగి పునరుజ్జీవానికి అవకాశం ఉన్న సొసైటీల కార్యకలాపాలు మనుగడలోనికి తీసుకొని రావడంపై సమగ్ర నివేదిక అందజేయాలని కలెక్టర్ సూచించారు. అంతర్జాతీయ సహకార సంవత్సరాన్ని పురస్కరించుకుని వివిధ కార్యక్రమాలు నిర్వహించేందుకు జూలై నుంచి డిసెంబర్ వరకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. జిల్లా సహకార అధికారి ఎంవీ వెంకటరమణ మాట్లాడుతూ జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల వ్యవస్థలో నూరు శాతం కంప్యూటరైజేషన్ చేయడం జరిగిందని తెలిపారు. సొసైటీ సభ్యులకు సంబంధించి 89 శాతం ఈకేవైసీ పూర్తిచేశామని తెలపగా, మిగిలిన 11శాతం కూడా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టంచేశారు. గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలు అందించే డీసీసీబీ బ్యాంక్‌లు రైతులకు రుణాలు ఎందుకు ఇవ్వడంలేదని, కారణాలు వివరించాలని కలెక్టర్ ప్రశ్నించారు. సమావేశంలో జేసీ ఎస్.చిన్నరాముడు, జిల్లా మార్కెటింగ్ అధికారి ఎం.సునీల్‌వినయ్, జిల్లా మత్స్యశాఖఅధికారి టి.నిర్మలకుమారి, కాకినాడ, ఏలూరు డీసీసీబీ అధికారులు పాల్గొన్నారు.

కట్టకపోతే.. రద్దే!

- పేదల ఇళ్ల లబ్ధిదార్లకు నోటీసులు
- డిసెంబరులోపు కట్టుకోకపోతే లోన్లు రద్దు
- 10,794 ఇళ్ల లక్ష్యం.. 6,325 పూర్తి
- 4,469 ఇళ్లు ఇంకా పెండింగ్
- అదనపు సొమ్ము ఇచ్చినా స్పందన నిల్

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వ అనాలోచన విధానాల వల్ల వేలాది పేదలకు కేటాయించిన కాలనీల్లో ఇళ్ల నిర్మాణం ఇబ్బందిగా మారింది. ప్రస్తుత ప్రభుత్వం అధికార్లకు టార్గెట్లు ఇవ్వడంతో రాత్రీపగలూ పనిచేసి, కొంత లక్ష్యం నెరవేరినా అనేకమంది పేదలు ముందుకు రాకపోవడంతో ఇళ్ల నిర్మాణాలు సాగడం లేదు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం లబ్ధిదార్లకు అదనపు ఆర్థిక సహాయం చేసినా చాలా ఇళ్ల నిర్మాణం చేపట్టడంలేదు. దీంతో పేదల కాలనీల్లో ఇళ్లు నిర్మించుకోని వారికి గృహ నిర్మాణశాఖ అధికారులు నోటీసులు ఇస్తున్నారు. డిసెంబరులోపు ఇళ్లను నిర్మించుకోకపోతే లోన్లను రద్దు చేస్తామని హెచ్చరించడం గమనార్హం. జిల్లాలో ఉన్న కాలనీల్లో ఈనెలాఖరుకి 10,794 ఇళ్ల నిర్మాణం పూర్తిచేయాలని ప్రస్తుత ప్రభుత్వం లక్ష్యం పెట్టింది. కానీ గత ప్రభుత్వం సెంటుంపావు స్థలంలో ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు ఇవ్వడంతో ఎక్కువమంది లబ్ధిదారులు కట్టుకోలేకపోయారు. దాంతో ప్రస్తుత ప్రభుత్వం డ్వాకా మహిళలకు కొంత సొమ్ము అదనంగా ఇవ్వడంతోపాటు రూ.15 వేల నుంచి 35 వేల వరకూ అదనపు సహాయం చేసింది. అయినా చాలామంది లబ్ధిదారులు ముందుకు రాలేదు. ఇక ఈనెలాఖరుకి జిల్లాలో 10,794 ఇళ్లు నిర్మించాలని లక్ష్యం పెట్టుకోగా, ఇప్పటికి 6,325 పూర్తయ్యాయి. ఇంకా 4,469 పెండింగ్ ఉన్నాయి. వీటిలో చాలావరకూ అసలు పనులే ప్రారంభించలేదు. డిసెంబర్‌లోపు అందరూ సొంతంగా నిర్మించుకోవాలని, లేకపోతే ఇంటి లోను రద్దు అవుతుందని హెచ్చరిస్తున్నారు. కానీ ఆయా కాలనీల్లో లబ్ధిదా ర్లకు కేటాయించిన స్థలాలను మాత్రం రద్దు చేయరు. కానీ వారు ఇల్లు కట్టుకోవడానికి మంజూరుచేసిన రుణం రద్దు చేస్తారు. దీంతో లబ్ధిదార్లలో కదలిక వస్తే మరిన్ని ఇళ్ల నిర్మాణం సాగుతుంది. కాగా జిల్లాలో మండలాల వారీ లక్ష్యాలను విధించారు. అనపర్తిలో 1036 ఇళ్లు కేటాయించగా, 685 జూన్ నెలాఖరుకి నిర్మించాలని లక్ష్యంగా పెట్టారు. కానీ 177 మాత్రమే పూర్తయ్యాయి. ఇంకా 508 పెండింగ్‌లో ఉన్నాయి. బిక్కవోలులో 908 ఇళ్లు కేటాయించగా, 695 జూన్ నెలాఖరుకి నిర్మించాలని లక్ష్యంగా పెట్టారు. కానీ 209 మాత్రమే పూర్తికాగా, 486 పెండింగ్‌లో ఉన్నాయి. సీతానగరంలో 269కి 90 పూర్తయ్యాయి. 179 పెండింగ్‌లో ఉన్నాయి. కొవ్వూరులో 460కి 163 పూర్తి, 297 పెండింగ్. చాగల్లులో 385కి 145 పూర్తి, 240 పెండింగ్‌లో ఉన్నాయి. రాజమహేంద్రవరం రూరల్‌లో 295కి 112 పూర్తి, 183 పెండింగ్. కొవ్వూరు అర్బన్‌లో 595కి 228 పూర్తి, 367 పెండింగ్. ఉండ్రాజవరంలో 306కి 134 పూర్తి, 172 పెండింగ్. రంగంపేటలో 304కి 136 పూర్తి, 168 పెండింగ్. నిడదవోలు అర్బన్‌లో 223కి 113 పూర్తి, 110 పెండింగ్. కడియంలో 219కి 111 పూర్తి, 108 పెండింగ్. తాళ్లపూడిలో 284కి 155 పూర్తి, 129 పెండింగ్. పెరవలిలో 138కి 83 పూర్తి, 56 పెండింగ్. గోకవరంలో 211కి 135 పూర్తి, 76 పెండింగ్. కోరుకొండలో 266కి 171 పూర్తి, 95 పెండింగ్. రాజానగరంలో 289కి 189 పూర్తి, 100 పెండింగ్. నిడదవోలులో 338కి 225 పూర్తి, 113 పెండింగ్. దేవరపల్లిలో 699కి 495 పూర్తి, 204 పెండింగ్. గోపాలపురంలో 474కి 349 పూర్తి, 125 పెండింగ్. నల్లజర్లలో 563కి 415 పూర్తి, 148 పెండింగ్. రాజమండ్రి అర్బన్‌లో 3096కి 2491 పూర్తి, 605 పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లాలో 3,362 మందికి ఇంటి నిర్మాణం కోసం అదనపు ఆర్థిక సహాయం చేశారు. మొత్తం రూ.7.76 కోట్లు అదనపు ఆర్థిక సహాయంగా ఇచ్చారు. అందులో ఇప్పటికి కేవలం 1030 పూర్తి అయ్యాయి. మిగతావి కదలలేదు.

రవాణా వాహనాల ఫిట్‌నెస్ విధానం ఉపసంహరించాలి

1న చలో రాజానగరం.. అఖిల పక్ష నేతల పిలుపు

7

ఆశా వర్కర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

రాజమహేంద్రవరం సిటీ, జూన్28(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఆశావర్కర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా వైద్యఆరోగ్య అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో వైద్యఆరోగ్యశాఖ పరిధిలో వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేయడానికి 30 మంది ఆశాకార్యకర్తలు అవసరమన్నారు. అనపర్తిలో 3, బిక్కవోలులో 1, రంగంపేటలో 2, రాజమహేంద్రవరం రూరల్‌లో 4, కడియంలో 3, రాజానగరంలో 2, కోరుకొండలో 2, సీతానగరంలో 2, గోకవరంలో 1, దేవరపల్లిలో 3, నల్లజర్లలో 2, తాళ్లపూడిలో 1, కొవ్వూరు రూరల్‌లో 1, చాగల్లులో 1, పెరవలిలో 1, ఉండ్రాజవరంలో 1 పోస్టు భర్తీకి ఈనెల 28 నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు స్థానిక పీహెచ్‌సీల్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు ప్రక్రియ, అర్హతలు జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఈస్ట్‌గోదావరి.ఎన్ఐసీ.ఇన్‌లో పొందుపరిచినట్టు తెలిపారు.


తిరుమల గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాల్లో కోలాటం ప్రదర్శన ఇస్తున్న బండారులంక శ్రీనివాసా కోలాటబృందం

కోలాటం..
సాంప్రదాయ జానపద నృత్యకళ

కోలాటం ప్రదర్శన జరుగుతుందంటే అటుగా వెళ్లేవారు ఆగి మరీ చూస్తారు. ఆరోహణ అవరోహణ క్రమంలో కోలాట ప్రదర్శన జరుగుతున్నప్పుడు కళాభిమానులు తమకు తెలియకుండానే నిలబడ్డ చోటు నుంచే పదం.. పాదం కదుపుతూ తాళం వేస్తుంటారు. శతాబ్ధాల చరిత్ర కలిగిన కోలాట ప్రదర్శన నేడు ప్రధాన ఆలయాల్లోనే కాదు పండుగలు, ఇతర దేవతామూర్తుల వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా మారింది. గురువుల సమక్షంలో గజ్జ పూజచేస్తే గానీ కోలాటం శిక్షణ పూర్తి చేసుకున్నవారు ప్రదర్శన ఇచ్చే అవకాశం లేదు. కోలాటం అనేది సాంప్రదాయ జానపథ నృత్యరూపకం.

- తిరుమల బ్రహ్మోత్సవాల్లో ప్రత్యేకం
- బండారులంక కోలాటబృందం ప్రత్యేక ఆకర్షణ


గజ్జ పూజ నిర్వహిస్తున్న గురువు

లయబద్ధంగా కోలాటం..

అమలాపురంరూరల్, జూన్28(ఆంధ్రజ్యోతి): లయబద్ధంగా కోలాటం జరుగుతుంటే హృదయం కూడా అంతే లయబద్ధంగా స్పందిస్తోంది. కోల అంటే కర్ర. ఆట అంటే నృత్యమని అదే కోలాటమంటారు. ఇటీవల కాలంలో వయోబేధం, లింగబేధం లేకుండా కోలాటం నేర్చుకోవాలన్న తపన అంతకంతకూ పెరుగుతుంది. అందుకు అనుగుణంగా గురువులు ప్రత్యేక శిక్షణ కేంద్రాలు నిర్వహిస్తూ శిక్షణ ఇస్తున్నారు. రెండు చేతులతో కర్రలు పట్టుకుని గుండ్రంగా తిరుగుతూ లయబద్ధంగా అడుగులు వేస్తూ ఒకరి కర్రను మరొకరు తాకిస్తూ కళాకారులు అద్భుతంగా ప్రదర్శన ఇస్తే చూసేందుకు రెండు కళ్లు చాలవు. సమూహంగా చేసే ఈ నృత్య ప్రదర్శనలో పాటలకు ప్రత్యేక స్థానం ఉంది.

పురంధరదాసు కీర్తనలు ప్రత్యేకం

కోలాటం చేసే బృందానికి ప్రత్యేకమైన డ్రెస్ కోడ్ ఉంటుంది. సాంప్రదాయ బద్ధమైన దుస్తులతోపాటు మహిళలు, బాలికలు ఆభరణాలు ధరించి కోలాటం ప్రదర్శన చేస్తుంటారు. గోవింద హరి గోవింద.. నల్లనల్ల కృష్ణయ్య, విట్టలవిట్టల గోవింద అంటూ పురంధరదాసు ఆలపించిన కీర్తనలతోపాటు అన్నమాచార్య కీర్తనలను గురువు ఆలపిస్తుండగా లయబద్ధంగా కోలాట ప్రదర్శన జరుగుతుంది. కాలంతో పాటు కోలాటం ప్రదర్శనలోను ఎన్నో మార్పులు వచ్చాయి. ఎవరి సాంప్రదాయాలకు అనుగుణంగా వారు కోలాటం ప్రదర్శనకు ప్రత్యేక పాటలను వారే రచించుకుంటూ వారి వారి పండుగల్లో ప్రదర్శనలు ఇస్తుండడం ప్రధానంగా దేవీ నవరాత్రుల సమయాల్లో చూస్తుంటాం. అంతేకాకుండా కోలాటంలో వాయిద్యాలు వాయిస్తూ ప్రత్యేకమైన పాటలు పాడుతూ చేసే నృత్యం సైతం పలువురిని ఆకట్టుకుంటుంది. సాంప్రదాయబద్ధమైన కోలాట బృందానికే ప్రత్యేక స్థానం అని చెప్పవచ్చు. కోలాటం పిల్లల నుంచి పెద్దల వరకు, పండితుల నుంచి పామరుల వరకు అన్నివర్గాల వారిని అలరించే కళారూపకంగా చెప్పవచ్చు.

తిరుమల బ్రహ్మోత్సవాల్లో ప్రత్యేకం

బండారులంక గ్రామంలో కాల్దరి గ్రామానికి చెందిన ఏటూరి రామకృష్ణ ఆధ్వర్యంలో ఇప్పటికే ఎందరో కోలాటం శిక్షణ పొందారు ఇటీవల తిరుపతి గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాలతోపాటు అప్పలాయగుంట ఆలయాలవద్ద బండారులంకకు చెందిన 50 మంది కోలాటం బృందం ప్రదర్శన ఇచ్చారు. అదేవిధంగా చింతలో నూకాలింకాలయం, కోట రాజగోపాల స్వామి ఆలయం, నగరం పట్టాభిరామ ఆలయంలో శ్రీశ్రీనివాసా భజన మండలి పేరిట పలు ప్రదర్శనలు ఇచ్చినట్టు బాలమిత్ర సంఘం వ్యవస్థాపకుడు చింతపట్ల బాబు తెలిపారు. బండారులంక పరిసర ప్రాంతాల్లో జరిగే ఉత్సవాల్లో సైతం ఈ బృందం ప్రత్యేక ప్రదర్శనలు ఇస్తోంది.

కొత్త బంగారు లోకం.. మీకు కావాలి సొంతం..



పాఠశాల చదువు అయిపోయింది. బడిబాటను వీడి.. కాలేజీ వైపు పయనం మొదలైంది. నూతన పరిచయాలు, స్నేహాలు, సరికొత్త ఆలోచనలు.. ఇప్పుడిప్పుడే కాలేజీలో అడుగు పెట్టే విద్యార్థులకు అన్నీ కొత్తగా, వింతగా 'హ్యాపీడేస్'లా అనిపిస్తాయి. ఇంటర్ విద్యార్థులకు ఇదో కొత్త అనుభవం. విద్యార్థుల జీవితాల్లో ఇంటర్ విద్య అత్యంత కీలకమైనది. ఇక్కడి నుంచే వారి భవిష్యత్తుకు బంగారు బాటలు పడతాయి. అంతేకాదు.. జీవితాన్ని తలకిందులు చేసే సమయం కూడా ఇదే. ఇప్పుడిప్పుడే ఇంటర్ కాలేజీల్లో చేరుతున్న వారు పలు జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా విద్యార్థుల తల్లిదండ్రులు కూడా వీరిపై ఓ కన్నేసి ఉంచాలి. అప్పుడే పిల్లల భవిష్యత్తు కొత్త బంగారు లోకమై వెలుగుతుంది.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

స్కూల్ లైఫ్‌కు ఫుల్‌స్టాప్ పడింది. కాలేజీ లైఫ్ మొదలైంది.. పదో తరగతి పరీక్షల్లో విజయం సాధించామనే ఆనందం.. కళాశాలల్లో చేరామన్న ఉత్సాహం ప్రతి ఇంటర్ విద్యార్థిలో కనిపిస్తుంటుంది. కొత్త, కొత్త పరిచయాలు, కాలేజీ వాతావరణం కలిగించే ఆనందం ఇలా అన్నీ సరికొత్త అనుభూతిని ఇస్తాయి. ఈ ఇంటర్ విద్యే ప్రతి విద్యార్థి జీవిత గమనాన్ని నిర్ణయిస్తుందనడంలో ఎటువంటి సందేహం లేదు. చక్కగా చదివి గట్టెక్కితేనే ఉజ్వల భవిష్యత్తు ఏర్పడుతుంది. ఏ మాత్రం అశ్రద్ధ కొరవడినా జీవితం గాడి తప్పినట్టే.. సినిమాల ప్రభావం, స్నేహితులే లోకంగా గడిపే సందర్భాలు ఇక్కడ సాధారణంగా కనిపిస్తుంటాయి. ఇదే సమయంలో స్నేహితులకు, అనవసర విషయాలకు అధిక ప్రాధాన్యమిచ్చి.. తల్లిదండ్రులు, అధ్యాపకులను నిర్లక్ష్యం చేస్తూ ఎక్కువమంది విద్యార్థులు ఉంటారు. ఈ సమయంలో ఒక నిర్దిష్టమైన లక్ష్యంతో అడుగులు వేస్తే జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోగలమనే విషయాన్ని ప్రతి ఇంటర్ విద్యార్థి గుర్తుంచుకోవాలి.

- చదువుపై దృష్టిపెడితే అన్నీ 'హ్యాపీడేస్..'
- వ్యసనాలకు అలవాటు పడితే భవిష్యత్తు అంధకారమే
- తల్లిదండ్రులూ పిల్లలను గమనించాలి
- భవిష్యత్తుకు బంగారు బాట వేసుకునే దశ 'ఇంటరే'

ఎప్పటికప్పుడు నోట్స్..

ఇంటర్‌లో ప్రతి విద్యార్థి చదువుకే తొలి ప్రాధాన్యం ఇవ్వాలి. స్కూల్‌లో పాఠ్యాంశాలకు, కాలేజీ పాఠ్యాంశాలకు మధ్య వ్యత్యాసం చాలా కనిపిస్తుంది. విధిగా తరగతులకు హాజరుకావడం, పాఠ్యాంశాలపై దృష్టిసారించాలి. అధ్యాపకులు ఇచ్చే నోట్స్‌ను ఎప్పటికప్పుడు చక్కగా రాసుకోవాలి. ముఖ్యంగా వారాంతపు పరీక్షలు నిర్వహిస్తే వాటిలో మంచి మార్కులు వచ్చేలా సాధన చేయాలి. సెలవు రోజులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. అలా చేస్తే విద్యార్థి ఎన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించగలరు. క్రీడలు, లైబ్రరీలో పుస్తక పఠనం, స్నేహితులతో సబ్జెక్టులపై చర్చ, వినోదం వంటివి ఆహ్లాదంతో పాటు జీవితాన్ని ఆనందమయం చేస్తాయి.

చెడు వ్యసనాలు వద్దు..

జీవితాన్ని మలుపు తిప్పే ప్రమాదకరమైన చెడు వ్యసనాలు ఈదశలోనే ఎక్కువగా అలవాటు అవుతాయి. ముఖ్యంగా వాటి బారిన పడకూడదు. పడితే అంతే సంగతులు. అందుకే సిగరెట్, గుట్కాలు, మద్యం వంటి వాటికి దూరంగా ఉండాలి. ఇక అశ్లీలత అంశాలపై దృష్టి పెట్టినా, వేడుకల పేరుతో స్నేహితులు చెడు దారుల వైపు ప్రేరేపించినా వాటి జోలికి అస్సలు వెళ్లకూడదు. కాలేజీలు ఎగ్గొట్టి తిరిగే దశ కూడా ఇదే. ఈ సమయంలోనే విద్యార్థులు అల్లరిచిల్లరగా తిరిగేందుకు చూస్తుంటారు. స్నేహితుల ప్రభావం ఇలాంటి సందర్భంలో అధికంగా ఉంటుంది. మంచి భావాలున్న వారితో స్నేహం చేస్తే అంతా బాగుంటుంది. చదువుపై ఇష్టం, పెద్దలపై గౌరవం, సమాజంపై అవగాహన, అధ్యాపకులపై సదాభిప్రాయం ఉన్న వారితో స్నేహం చేయాలి.

లక్ష్యం వైపు అడుగులు..

మీ ప్రయాణం ఎప్పుడూ భవిష్యత్తులో ఉండే లక్ష్యం వైపు ఉండాలి. ఇంజినీరింగ్, మెడిసిన్, డిగ్రీ తదితర ఏ కోర్సుకైనా తొలి అడుగు పడాల్సింది ఇంటర్లోనే. కొత్తకొత్త స్నేహదనంతో నిండి కళాశాల జీవితం సక్రమంగా సాగితే ఒక బంగారులోకమవుతుంది. తప్పటడుగులు వేస్తే అధోగతి పాలవుతుంది. అలా లక్ష్యాన్ని నిర్ణయించుకుని ముందుకు సాగాలి. దీని కోసం రోజూ కొంత సమయం కేటాయించాలి. మీరు డాక్టర్ కావాలనుకుంటే.. రోజూ కొంత సమయం దానికి సంబంధించిన పుస్తకాలు చదవడం లేదా వీడియోలు చూడడం లాంటివి చూడాలి. ఇంజనీర్ కావాలనుకుంటే దానికి ఆ సబ్జెకులకు సంబంధించిన అంశాలపై దృష్టిపెట్టాలి. కెరియర్‌లో మీకంటే సీనియర్లతో మాట్లాడాలి. సబ్జెక్టుల్లో అనుమానాలు ఉంటే లెక్చరర్లను సంప్రదించాలి. మొత్తానికి ప్రణాళికాబద్ధంగా చదువుకుంటేనే భవిష్యత్తులో మీరు లక్ష్యాన్ని చేరుకోగలుగుతారు.

బరువు తగ్గితే.. 'బ్యాగు'ంటుంది..

- పుస్తకాల సంచి విషయంలో జాగ్రత్తలు తప్పనిసరి..
- చిన్నారుల వెన్నెముకపై ప్రభావం చూపే ప్రమాదం
- తల్లిదండ్రులూ జాగ్రత్తలు తీసుకోండి.


(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

బండి గంటలు మోగాయి. బండెడు పుస్తకాలు.. బరువైన బ్యాగులతో పిల్లలు బడిబాట పడుతున్నారు. తమ పిల్లాడి బ్యాగు నిండా పుస్తకాలు చూసి.. అబ్బో! స్కూల్లో చాలా గట్టిగా పాఠాలు చెబుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు మురిసిపోతుంటారు. పిల్లల వీపుపై కిలోల కొద్దీ బరువైన స్కూల్ బ్యాగ్ మోయించడం సబబు కాదంటున్నారు వైద్య నిపుణులు. పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందంటున్నారు.

'భారం' కాకుండా..

చిన్నారులకు విద్య 'భారం' కాకూడదు. చదువులు 'బరువు'గా వారు ఫీల్ కాకూడదు. చాలా మంది విద్యార్థి మోసే బ్యాగ్ బరువును బట్టి అతడి చదువును అంచనా వేస్తారు. పిల్లలు బయటకు చెప్పలేని ఆ భారాన్ని మోస్తూ అనారోగ్యాలు కొని తెచ్చుకుంటారు. పిల్లలు ఆరోగ్యం కోసం శ్రద్ధ చూపే తల్లిదండ్రులు స్కూల్ బ్యాగ్ బరువు విషయంలో కూడా కచ్చితంగా జాగ్రత్తలు తీసుకోవాలి. పిల్లల్ని స్కూల్‌కు పంపేటప్పుడు అవసరమైన పుస్తకాలతోనే పంపాలి.

ప్రైవేటు మరీను..

ప్రైవేటు స్కూళ్ల విద్యార్థులకు 'బరువు' బాధ్యతలు అధికం. చదువుల పేరుతో ఈ స్కూళ్లల్లో పుస్తకాలను అధికంగా కొనిపిస్తుంటారు. స్కూళ్లల్లో రెగ్యులర్ సిలబస్‌తోపాటు అసైన్‌మెంట్, ప్రాజెక్టులు, స్లిప్ టెస్టులు, క్లాస్ వర్క్, హోం వర్కు, రఫ్ కాపీ, గైడ్, డైరీ, డ్రాయింగ్, క్రాఫ్ట్, ఆర్ట్, జనరల్ నాలెడ్జ్, కంప్యూటర్ బుక్ ఇలా విద్యార్థులకు ప్రతి సబ్జెక్టుకు పది వరకు పుస్తకాలు ఇలా దాదాపు 40 పుస్తకాల కేటాయిస్తూ విద్యార్థులతో బరువులు మోయిస్తున్నారు. స్కూల్ బ్యాగ్ బరువు విద్యార్థి వయస్సు ఎత్తుకు తగ్గట్టు ఉండాలని, విద్యార్థి బరువులో పది శాతం మించకూడదనేది వైద్య నిపుణుల సూచన. అధిక బరువున్న స్కూల్ బ్యాగుల పిల్లల శారీరక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావంచూపే ప్ర మాదం ఉందని, ముఖ్యంగా వెన్నుముకపై భారమవుతుందని వైద్యనిపుణులు చెబుతున్నారు.

బరువు తగ్గాలంటే..

- పిల్లలకు అవసరమైన పుస్తకాలు, నోట్‌బుక్‌లు మాత్రమే స్కూల్‌కు తీసుకువెళ్లేలా చూడాలి. బ్యాగుల్లో వాటిని మాత్రమే ఉంచాలి.
- స్కూల్‌కు దగ్గరగా ఇల్లు ఉన్న పిల్లలు పొద్దున తరగతుల పుస్తకాలు మాత్రమే తీసుకువెళ్లేలా చూసి, లంచ్‌బ్రేక్ సమయంలో మధ్యాహ్నం తరగతులకు పుస్తకాలు తీసుకువెళ్లాలి.
- రేపు ఏయే పాఠాలు జరుగుతున్నాయో, ఏయే టీచర్లు సెలవులో ఉన్నారో, ఏ పుస్తకాలు అవసరమో ముందే పిల్లలకు చెప్పేలా ప్రణాళిక రూపొందించమని స్కూల్ యజమాన్యాన్ని అడగాలి.
- చాలా పాఠశాలల్లో క్లాస్ వర్క్, హోం వర్క్ అని రెండు వేర్వేరు పుస్తకాలు వాడమని పిల్లలకు సూచిస్తుంటారు. దానికి బదులు ముందు వైపు క్లాస్ వర్క్, వెనుక వైపు హోం వర్క్ రాసేలా చూడమని టీచర్లకు సూచించొచ్చు.
- కొన్ని పాఠశాలల్లో డబుల్ బ్యాగ్ సిస్టమ్‌ను అమలు చేస్తున్నారు. అంటే రోజువారీ పాఠ్య పుస్తకాలు అక్కడే పుట్టి, హోంవర్క్ పుస్తకాలు మాత్రం ఇంటికి తెచ్చుకునే వెసులుబాటు ఉంటుంది. ఇది ప్రైవేటు పాఠశాలల్లో కచ్చితంగా అమలయ్యేలా చూడాలి.

నో బ్యాగ్ డే..

వారానికి ఒకసారి, నెలలో రెండు రోజులు పిల్లలకు స్కూల్ బ్యాగ్ నుంచి మినహాయింపు ఇచ్చేలా చూడాలి. ఇవిఅమలు చేయాలనే ఆలోచనలు కొన్ని ప్రభుత్వాలు చేసినా అవి కార్యరూపం దాల్చడం లేదు. స్కూల్ బ్యాగ్‌లేని రో జు పిల్లలు ఆటలు, పాటలు, కథలు, బొమ్మలు.. వీటితో గడిపితే మానసిక వికాసం కలుగుతుం ది. బ్యాగ్ మోతతప్పి వెన్నుకువిశ్రాంతి లభిస్తుంది.

నల్సా పథకాలు ప్రజలకు చేరువకావాలి

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత



సదస్సులో ప్రసంగిస్తున్న పీడీజే సునీత

రాజమహేంద్రవరం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): జాతీయ లీగల్ సర్వీసెస్ అథారిటీ(నల్సా) అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు చేరువ కావాల్సిన అవసరం ఉందని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికారం సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత పేర్కొన్నారు. డీఎల్ఎస్‌ఏ, జిల్లా యంత్రాంగం సంయుక్తంగా నల్సా వారి 'పేదరిక నిర్మూలన, మానవ అక్రమ రవాణా', లీగల్ సర్వీసెస్‌లో కొత్త మాడ్యూల్‌లపై ఏర్పాటు చేసిన సదస్సుకు ఆమె ముఖ్య అతిథి గా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అంద జేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో ఉండే ఏడు న్యాయ సేవల పథకాలను ఇప్పుడు 14కు నల్సా పెంచిందన్నారు. జిల్లా స్థాయిలో డీఎల్ఎస్‌ఏ ద్వారా, మండల స్థాయిలో ఎంఎల్ఎస్‌ఏ ద్వారా అర్హులైన వారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తున్నామన్నారు. నేటి సమాజంలో చిన్నారులు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై చిన్నారులు ప్రదర్శించిన నృత్య రూపకాలు ఆలోచింపజేశాయని చెప్పారు. డీఎల్ఎస్‌ఏ ఏర్పాటు, కార్యకలాపాలు, న్యాయ సహాయం, వివిధ చట్టాలను సంస్థ కార్యదర్శి శ్రీలక్ష్మీ వివరించారు. అనంతరం డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో డ్వాక్రా సంఘాలకు రుణాల నిమిత్తం రూ.కోట్లు, మెప్మా ఆధ్వర్యంలో రూ.3.60కోట్ల చెక్కులను, దివ్యాంగులకు వినికిడి యంత్రాలు, వీల్‌చైర్లు, బ్రెయిలీ లిపి పుస్తకాలు, స్త్రీ నిధి కింద కెమెరా కొనుగోలుకు రూ.1 లక్ష చెక్కును పీడీజే అందజేశారు. తొలుతగా మెప్మా, డీఆర్‌డీఏ, వైద్య ఆరోగ్య, ఐసీడీఎస్, పోలీస్, డీఎల్ఎస్‌ఏ, వ్యవసాయ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ని తిలకించారు. కార్యక్రమంలో ఎస్పీ నరసింహకిషోర్, పీడీ మూర్తి, కార్పొరేషన్ ఏసీ రామలింగేశ్వర్ పాల్గొన్నారు.

ఆవిష్కరణలు, పరిశోధనలతోనే దేశాభివృద్ధి

- వికసిత్ భారత్-2047 మనందరి బాధ్యత
- న్యూక్లియర్ సైన్సు చదివితే మంచి అవకాశాలు
- జీజీయూ జాతీయ సదస్సులో నీతి ఆయోగ్ సభ్యుడు సారస్వత్



సారస్వత్‌ను సత్కరిస్తున్న జీజీయూ ఛాన్సలర్ చైతన్యరాజు

రాజానగరం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఆవిష్కరణలు, పరిశోధనలతోనే దేశాభివృద్ధి సాధ్యపడుతుందని నీతి ఆయోగ్ సభ్యుడు, ప్రఖ్యాత మిస్సైల్ శాస్త్రవేత్త, పద్మభూషణ్ అవార్డు గ్రహీత వీకే సారస్వత్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం వికసిత్ భారత్ ఎట్ 2047 కోసం పరిశోధన, ఆవిష్కరణను ఉపయోగించడం అనే అంశంపై రెండు రోజుల పాటు నిర్వహించే జాతీయ సెమినార్‌ను శనివారం సారస్వత్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ వికసిత్ భారత్-2047 ఒక దృష్టి మాత్రమే కాదు, మనందరి బాధ్యత అన్నారు. ఇప్పటికే ప్రభుత్వ పరిశోధన అభివృద్ధికి రూ.1.27 లక్షల కోట్లకు పైగా నిధులు కేటాయించిందన్నారు. ప్రతి విద్యార్థి, పరిశోధకుడు, కళాశాల, విశ్వవిద్యాలయం, ఔత్సాహికులు దేశ నిర్మాణంలో పాత్ర వహించాలన్నారు. విద్యామంత్రిత్వ శాఖ ఇప్పటికే మూడు వేలకు పైగా ఇనిస్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిళ్లను ఏర్పాటు చేసి జాతీయ ఆవిష్కరణ స్టార్టప్ విధానం ద్వారా విద్యార్థుల్లో ఔత్సాహికతను ప్రోత్సహిస్తోందన్నారు. మన జీడీపీలో 62 శాతం సేవల రంగం నుంచి, 14శాతం మాత్రమే తయారీ రంగం నుంచి వస్తోందని, ఇదొక ప్రధాన సమస్య అన్నారు. తమ దేశ జీడీపీలో చైనా 2.6 శాతం, దక్షిణ కొరియా 4.9 శాతం, ఇజ్రాయిల్ 6.3 శాతం పరిశోధనా రంగంపై ఖర్చు చేస్తుంటే మనం 0.64 శాతం మాత్రమే ఖర్చు చేస్తున్నామన్నారు. 1980 ముందు సాధారణంగా ఉన్న దక్షిణ కొరియా రెండు దశాబ్దాల్లో ఎలక్ట్రానిక్స్, బయోటెక్నాలజీ రంగాల్లో విశేషమైన పురోగతి సాధించిందన్నారు. ఆదేశ పరిశ్రమలు ఇన్‌హౌస్ రీసెర్చ్‌పై పరిశోధనలు చేయడం వల్లే ఇది సాధ్యమైందన్నారు. మన దేశంలో మాత్రం పరిశోధనలు కేవలం ప్రభుత్వ రంగానికే పరిమితం అయ్యాయని, ఈ పరిస్థితి మారాలన్నారు. పరిశ్రమలు పరిశోధనలపై ఖర్చు చేయాలని సూచించారు. ప్రస్తుతం విద్యార్థుల దృష్టి కంప్యూటర్ సైన్సుపైనే ఉందని, ఇదే పరిస్థితి కొనసాగితే దేశంలో రైల్వేలు, థర్మల్ విద్యుత్ కేంద్రాలు వంటి వాటికి మానవ వనరుల కొరత ఏర్పడుతుందన్నారు. 2047 నాటికి 100 గిగా వాట్ల అణుశక్తి అవసరమని, అందుకే న్యూక్లియర్ సైన్సు చదివితే మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. నవీకరణను ఇక్రిమెంటల్ ఇన్నోవేషన్, బ్రేక్‌తూ ఇన్నోవేషన్ అని రెండు రకాలుగా చెప్పవచ్చన్నారు. ప్రస్తుతం దేశానికి రెండోది అవసరమైని, దీని ద్వారా అద్భుత ఫలితాలు సాధించవచ్చన్నారు. ఇన్నోవేషన్‌కి పెట్టుబడితో పాటు మార్కెట్ అవసరమన్నారు. సదస్సు కన్వీనర్ శిశిర్ సాహూ అన్వయాత్మక పరిశోధన ప్రాధాన్యతను, జ్ఞానాధారిత ఆర్థిక వ్యవస్థ వైపు దృష్టి సారించి, పరిశోధన పర్యావరణాన్ని బలోపేతం చేయాల్సిన అవసరాన్ని వివరించారు. సదస్సులో జీజీయూ ఛాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు, ప్రోఛాన్సలర్ కే.శశికిరణ్ వర్మ, ఉపకులపతి యు.చంద్రశేఖర్, ప్రోవైస్ ఛాన్సలర్ కె.విజయ భాస్కరరాజు, డీన్లు, డైరెక్టర్లు, ప్రిన్సిపాల్స్, విభాగాధిపతులు, అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, ఇతర విశ్వవిద్యాలయాల నుంచి వచ్చిన ప్రతినిధులు పాల్గొన్నారు.

మొక్కల మాటున గంజాయి

- కడియంలో 326 కిలోల పట్టివేత


లారీలో తరలిస్తున్న గంజాయి

కడియం జూన్ 28(ఆంధ్రజ్యోతి): మొక్కలు మాటున గంజాయి కడియం మండలంలో మొక్కలు లోడుకు వచ్చిన లారీ అందులో గంజాయిని గుట్టుచప్పుడుకాకుండా పట్టుకువెళే ప్రయత్నం చేయడంతో దానిని చాలా చాకచక్యంగా ఎన్‌సీబీ పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే రాజస్థాన్‌కు చెందిన సత్యనారాయణ మీరా, సునీల్ అనే ఇద్దరు మొక్కలు లోడు కోసం కడియం వచ్చారు. అయితే ఈ లారీని నేరుగా విశాఖఏజెన్సీకి తీసుకువెళ్లి గంజాయిని లోడుచేసుకుని వాటిలో మొక్కలు కవరింగ్ ఇచ్చి తిరిగి కడియం చేరుకున్నారు. దీనిని నార్కొటిక్ పోలీస్ విభాగం కనిపెట్టి చాకచక్యంగా పట్టుకుంది. లారీలో 326 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని నిందితులు ఇద్దరినీ అరెస్టు చేశారు. నిందితుల్లో సత్యనారాయణ మీరా అనే వ్యక్తి పాత నేరస్తుడని అతడిపై గతంలో గంజాయి కేసులు ఉన్నాయని కడియం సీఐ అల్లు వెంకటేశ్వరరావు తెలిపారు.

స్వల్పంగా పెరుగుతున్న గోదావరి నీటిమట్టం

ధవళేశ్వరం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): గోదావరి నీటి మట్టం స్వల్పంగా పెరుగుతోంది. వర్షాకాలం ప్రారంభమైనా కొత్తనీటి ప్రవాహం చేరిక లేక గోదావరి ఇప్పటి వరకు ప్రశాంతంగానే ప్రవహించింది. పరివాహక ఎగువ ప్రాంతాలతో పాటు ఉపనదుల పరివాహకంలో కూడా సరైన వర్షపాతం నమోదు కాకపోవడంతో గోదావరి రంగు మారక నిశ్శబ్ద ప్రవాహంతో ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ వద్ద ఒదిగిపోతుంది. ప్రస్తుతం కాటన్ బ్యారేజ్ నుంచి రైతు సాగునీటి అవసరాల కోసం డెల్టా కాలువల ద్వారా 10,500క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. గోదావరి నీటి మట్టం మరింత పెరిగితే పట్టిసీమ ద్వారా నీటిని కృష్ణా డెల్టాకు ఎత్తిపోయడానికి సిద్ధంగా ఉన్నారు. నీటి మట్టం తగు స్థాయిలో ఉండే విధంగా కాటన్ బ్యారేజ్ వద్ద గేట్లను మూసి వేసి చుక్కనీరు కూడా సముద్రంలోకి పోకుండా చర్యలు చేపట్టారు. ఎగువన భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం 5అడుగులుగా ఉంది. గత ఏడాది ఇదే సమయానికి 11వేల క్యూసెక్కుల నుంచి డెల్టా కాలువలకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ధవళేశ్వరం వద్ద నీటి మట్టం 10.90 అడుగులుగా నమోదయింది.

సత్యదేవుడికి ప్రాకారసేవ

అన్నవరం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడికి శనివారం ప్రాకార సేవ వేడుకగా జరిగింది. ఉదయం 10గంటలకు స్వామి, అమ్మవార్లను ప్రదానాలయం నుంచి తిరుచ్చివాహనంపై ఆశీనులు గావించి తూర్పురాజగోపురం వద్దకు తోడ్కొనివచ్చారు. పండితులు ప్రత్యేక పూజలనంతరం మంత్రోచ్ఛారణలు, బాజాభజంత్రీల నడుమ ముమ్మారు ప్రదక్షిణ జరిపారు.

బ్లెసన్ కుటుంబానికి ఐజీ అశోక్ పరామర్శ


బ్లెసన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఐజీ అశోక్‌కుమార్

ఆలమూరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఇటీవల కోదాడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కానిస్టేబుల్ బ్లెసన్‌జీవన్ కుటుంబ సభ్యులను ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ శనివారం పరామర్శించారు. ఆలమూరులోని కానిస్టేబుల్ బ్లెసన్ ఇంటికి విచ్చేసి బ్లెసన్ చిత్రపటానికి పూలమాలలతో నివాళులు అర్పించారు. అనంతరం బ్లెసన్ కుటుంబ సభ్యులతో ఐజీ మాట్లాడారు. ప్రభుత్వ పరంగా పూర్తి న్యాయం చేస్తామన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. ఈ సందర్భంగా తమ చిన్న కుమారుడికి పోలీసు ఉద్యోగం ఇప్పించాలని కోరడంతో మరికొన్నింటిని బ్లెసన్ కుటుంబ సభ్యులు ఐజీకి విన్నవించగా ఆ మేరకు చేయడానికి ప్రయత్నిస్తానని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా ఐజీ వెంట కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్, రావులపాలెం రూరల్, టౌన్ సీఐలు సీ హెచ్ విద్యాసాగర్, ఎం.శేఖర్‌బాబు, ఏఎస్ఐ సూర్యచంద్రరావు, పలువురు సిబ్బంది, నాయకులు చల్లా ప్రభాకరావు, వెత్సా నానాజీ తదితరులు పాల్గొన్నారు.

భక్తవత్సల గోవింద..

- వాడపల్లి వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తజనం
- స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.63.14 లక్షలు

ఆత్రేయపురం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): వాడపల్లి క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని శనివారం అధిక సంఖ్యలో భక్తులు బారులు దీరి దర్శించుకున్నారు. ఈ స్వామి వారికి సందర్భంగా సుప్రభాతసేవ, ఐశ్వర్యలక్ష్మి హోమం, బాలభోగం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామి వారిని వివిధ రకాల ఫలాలు, పుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారి తీరు వీధుల్లో ప్రదక్షిణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. తులభారాలు, కానుకులు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.63.14 లక్షలు లభించినట్టు ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.


ఆలయంలో కూచిపూడి నృత్యప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన


ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

కాగా స్వామి వారి ఆలయంలో ధర్మపధం కార్యక్రమంలో భాగంగా రాత్రి రాజమహేంద్రవరం శ్రీలక్ష్మీశ్రీనివాస కూచిపూడి నృ త్యాలయానికి చెందిన చిన్నారుల నృత్య ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఓ చిన్నారి రెండు చేతులతో దీపాలు శిరస్సుపై బిందెలతో జ్యోతిని వెలిగించి చేసిన నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. చిన్నారులకు అధికారులు ప్రశంసాపత్రాలను అందించారు.

వైద్య, ఆరోగ్యశాఖ ఆర్‌డీగా డాక్టర్ పద్మాశశిధర్

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని ప్రాంతీయ వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయం జోన్-2 రీజనల్ జాయింట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న డాక్టర్ పద్మాశశిధర్ డైరెక్టర్‌గా పదోన్నతి పొందారు. ఈమేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయి. డైరెక్టర్‌గా పదోన్నతి పొందిన పద్మాశశిధర్‌ను ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకుడు శ్రీకాంత్ రాజు, ఐఎన్‌టీయూసీ నాయకులు ఎంవీవీ సత్యనారాయణ, వైఎస్ఎన్ మూర్తి, రామచంద్రరావు, జయచంద్ర కలసి అభినందనలు తెలిపారు.



రవాణా వాహనాల ఫిట్‌నెస్ విధానాన్ని ఉపసంహరించుకోవాలి

జూలై 1న 'చలో రాజానగరం' విజయవంతం చేయాలని అఖిల పక్ష నేతల పిలుపు



రాజమహేంద్రవరంలో ఐక్యత చాటుతున్న అఖిల పక్ష నేతలు

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 28(ఆంధ్రజ్యోతి): రవాణా వాహనాల ఫిట్‌నెస్ (బ్రేక్) రవాణా శాఖ అధికారుల నుంచి ప్రైవేట్ సంస్థలకు కూటమి ప్రభుత్వం అప్పజెప్పడం వల్ల రవాణా కార్మికులకు ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని వెంటనే ఆ విధానాన్ని ఉపసంహరించుకోవాలని అఖిలపక్ష నేతలు డిమాండ్ చేశారు. శనివారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఆనంద్ రీజెన్సీ పందిరి హాలులో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు వాసంశెట్టి గంగాధర్, మాజీ డిప్యూటీ మేయర్ బాక్స్ ప్రసాద్ నేతృత్వంలో జరిగిన అఖిలపక్ష సమాశంలో మాజీ ఎంపీలు ఉండవల్లి అరుణ్ కుమార్, మార్గాని భరత్‌రామ్, సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, డీసీసీ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి, ఆర్‌పీసీ వ్యవస్థాపక అధ్యక్షుడు మేడా శ్రీనివాస్, సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, కార్మిక సంఘాల నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది గడచినా రవాణా రంగ కార్మికులకు ఎటువంటి న్యాయం జరగలేదన్నారు. రవాణా కార్మికులకు ఈ ఫిట్‌నెస్ విధానం వల్ల బాధ ఉన్నందువల్లే ఇంతమంది వచ్చారని త్వరలోనే దీనిపై సానుకూల నిర్ణయం ప్రభుత్వం నుంచి వస్తుందని ఆశిస్తున్నట్టు ఉండవల్లి అన్నారు. రవాణా కార్మికులకు అవసరమైన న్యాయ సహాయం చేయడానికి తాను ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటానన్నారు. ఏపీలో ప్రైవేటీకరణ విధానాన్ని ఉపసంహరించుకునే వరకు ఆందోళన చేయడానికి అందరూ సంసిద్ధం కావాలని మార్గాని పిలుపునిచ్చారు. కన్వీనర్లు వాసంశెట్టి గంగాధర్, బాక్స్ ప్రసాద్ మాట్లాడుతూ ఏ రాజకీయ పార్టీ తరపున తాము ఈ ఆందోళన చేపట్టడం లేదని, అందర్నీ కలిపి జాయింట్ యాక్షన్ కమిటీగా ఏర్పడి ఉద్యమాన్ని ప్రారంభించామన్నారు. జూలై1న నిర్వహించే చలో రాజానగరం విజయవంతం చేయాలని తీర్మానించారు. ప్రభుత్వం నుంచి సానుకూల నిర్ణయం వెలువడితే చలో రాజానగరం కార్యక్రమాన్ని ఉపసంహరించుకోవడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. సమావేశంలో ఏజీటీయూసీ నాయకుడు రెడ్డి రమణ, వైసీపీ నాయకులు వైకేఎల్, కేఎల్ నరసింహ రెడ్డి, డీవీ రెడ్డి, ఐఎన్‌టీయూసీ ఉభయరాష్ట్రాల ఆర్గనైజింగ్ సెక్రటరీ టి.నారాయణరావు, ముచ్చకర్ల సత్యనారాయణ, పోలేపల్లి నాగేశ్వరరావు, ఆదినారాయణ, డ్రైవర్లు, ఓనర్లు పాల్గొన్నారు.

కన్ను పడితే.. ఇల్లు ఖాళీనే!

ముగ్గురు అంతర్ జిల్లా దొంగల అరెస్ట్

- రూ.65 లక్షల విలువైన చోరీ సొత్తు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్



కాకినాడలో నిందితుల వివరాలు వెల్లడిస్తున్న కాకినాడ జిల్లా ఎస్పీ



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న చోరీ సొత్తు

కాకినాడ క్రైం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ముగ్గురు కరుడు కట్టిన నేరస్థులు. వారు కన్ను పడిన ఇల్లు ఖాళీ కావాల్సిందే. ఆ అంతర్ జిల్లా దొంగలు 5 జిల్లాల్లో యథేచ్ఛగా 19 నేరాలకు పాల్పడి సుమారు రూ.65 లక్షల విలువైన 582 గ్రాముల బంగారు ఆభరణాలు, 12.500 కిలోల వెండి వస్తువులను అపహరించుకుపోయి జల్సాలు చేస్తూ కాకినాడ జిల్లా పోలీసులకు చిక్కారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నిందితుల వివరాలను ఎస్పీ జి.బిందుమాధవ్ వెల్లడించారు. ఇటీవల కాకినాడ జిల్లా పరిసర ప్రాంతాల్లో రాత్రి, పగటిపూట దొంగతనాలు అధికం కావడంతో ఎస్పీ ప్రత్యేక దృష్టి సారించారు. ఆయన ఆదేశాల మేరకు అడ్మిన్ ఎస్పీ ఎంజెవి భాస్కర్‌రావు పర్యవేక్షణలో కాకినాడ ఎస్‌డీపీవో మనీష్‌దేవరాజ్ పాటిల్, కాకినాడ రూరల్ సీఐ డీఎస్.చైతన్యకృష్ణ, క్రైం సీఐ వి.కృష్ణ తమ బృందాలతో కలిసి ఎక్కడికక్కడ నిఘాను పటిష్టం చేశారు. పోలీసులకు ముందుగా వచ్చిన సమాచారం మేరకు శుక్రవారం రాత్రి పెట్రోలింగ్ చేసే క్రమంలో సాంకేతికత సహాయంతో తాళ్లరేవు మండలం జి.వేమవరం పంచాయితీ వీధిలో నివాసం ఉంటున్న 42 ఏళ్ల బొగడ శ్రీను అలియాస్ బట్టి శ్రీను అతడి సహచరులైన అనపర్తి మండలం కుతుకులూరుకు చెందిన 23 ఏళ్ల పాశి శేఖర్‌ను, అదే ప్రాంతానికి చెందిన ప్రస్తుతం పశ్చిమగోదావరి జిల్లా తణుకులో ఉంటున్న 24 ఏళ్ల పోతంశెట్టి సూర్యభాస్కర్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని విచారించారు.

జైల్లో పరిచయం..యథేచ్ఛగా నేరాలు

ఈ విచారణలో బొగడ శ్రీను గతంలో తూర్పుగోదావరి, కోనసీమ, పశ్చిమగోదావరి జిల్లాల్లో 13 నేరాలకు పాల్పడి పామర్రు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఒక కేసులో ఏడాది పాటు జైలు శిక్ష అనుభవించినట్టు ఎస్పీ వెల్లడించారు. అతడిపై కడియం పోలీస్‌స్టేషన్‌లో 26-2021గా సస్పెక్ట్ షీట్ ఉన్నట్టు చెప్పారు. అలాగే శేఖర్ గతంలో తూర్పుగోదావరి, కోనసీమ, పశ్చిమగోదావరి జిల్లాల్లో గతంలో నాలుగు నేరాలకు పాల్పడ్డాడు. సూర్యభాస్కర్‌రెడ్డి గతంలో తూర్పుగోదావరి, కోనసీమ, పశ్చిమగోదావరి జిల్లాల్లో 5 నేరాలకు పాల్పడ్డాడు కాగా తొలుత శేఖర్ సూర్యభాస్కర్‌రెడ్డి తండ్రి వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేసేవాడు. ఈ క్రమంలో అక్కడ ట్రాక్టర్‌ను ఇద్దరు దొంగలించారు. ఆ కేసులో శేఖర్‌తో పాటు సూర్యభాస్కర్‌రెడ్డి జైలుకు వెళ్లారు. జైల్లో వారికి బొగడ శ్రీను పరిచయమయ్యాడు. ఈ ముగ్గురు బెయిల్‌పై బయటకు వచ్చారు. అయితే అప్పటికే సూర్యభాస్కర్‌రెడ్డి, శేఖర్‌పై అనపర్తి పోలీసులు నిఘా పెట్టారు. బొగడ శ్రీనుపై కడియం పోలీస్‌స్టేషన్‌లో సస్పెక్ట్ షీట్ తెరవడంలో అక్కడ నుంచి ఆలమూరుకు మకాం మార్చాడు. అక్కడ చిన్న కిరాణా కొట్టు పెట్టుకుని ఆ ముసుగులో దొంగతనాలు చేసేవాడు. తన నిజస్వరూపం తెలిసిపోతుందని తాళ్లరేవు మండలం జివేమవరానికి మకాం మార్చి స్నేహితులతో కలిసి నేరాలకు పాల్పడేవాడు.

పలు జిల్లాలో 19 నేరాలు...

అలా వారు కాకినాడ జిల్లాలో కరప, గొల్లపాలెం, కోరింగ, సర్పవరం పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో 10 దొంగతనాలు... అంబేడ్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామ, రాయవరం పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో 2 నేరాలు... తూర్పుగోదావరి జిల్లా పరిధిలో పెరవలి, బిక్కవోలు, అనపర్తి పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో 4 నేరాలు.. పశ్చిమగోదావరి జిల్లాల్లో ఇరగవరం, పెంటపాడు పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో 2 నేరాలు, ఏలూరులోని చేబ్రోలు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక నేరం మొత్తంగా 19 ఇళ్ల నేరాలకు పాల్పడినట్టు ఎస్పీ వెల్లడించారు. నిందితులను కాకినాడ 7వ స్పెషల్ ఏజెఎఫ్‌సిఎం అండ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కోర్టులో హాజరుపర్చనున్నట్టు తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన రూరల్ సీఐ చైతన్య కృష్ణ, గొల్లపాలెం ఎస్ఐ ఎం.మోహన్‌కుమార్, కరప ఎస్ఐ టి.సునీత, హెచ్‌సీలు గొప్పు నరసింగరావు (చిన్నా), సీ.నారాయణరెడ్డి, పీసీలు చంద్రశేఖర్, శివప్రసాద్, ఫణీంద్ర, సురేష్‌కుమార్, రమణ, ఎన్ శ్రీనివాసరావులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. సమావేశంలో అడ్మిన్ ఎస్పీ ఎంజెవి భాస్కర్‌రావు, ఎస్‌బీ డీఎస్పీ సీహెచ్ శ్రీరామకోటేశ్వరరావు, సీఐలు అంకబాబు, వి.కృష్ణ ఉన్నారు.

తైక్వాండో పోటీల్లో లాహితితేజకు కాంస్యం

అంబాజీపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఉత్తరాఖాండ్ హరిద్వారాలో జరిగిన జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో కోనసీమ జిల్లా అంబాజీపేట శ్రీనివాస తైక్వాండో క్లబ్ క్రీడాకారిణి జి.లాహితి తేజ ప్రతిభ కనబరిచి కాంస్య పతకం సాధించింది. ఈనెల23 నుంచి 25 వరకు పోటీలు జరిగినట్టు సీనియర్ కోచ్ పితాని త్రిమూర్తులు తెలిపారు. కాంస్యం సాధించిన తేజను ఉపాధ్యాయులు, కోచ్‌లు అభినందించారు.



కాంస్య పతకం సాధించిన లాహితితేజ

బ్రెయిన్ స్ట్రోక్‌తో రాజోలు ఎంపీపీ మృతి

నివాళులర్పించిన మంత్రి, ఎమ్మెల్యేలు



కేతా శ్రీను (ఫైల్)

రాజోలు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా రాజోలు ఎంపీపీ కేతా శ్రీను(56) బ్రెయిన్ స్ట్రోక్‌తో ఆకస్మికంగా మృతిచెందారు. ఈనెల 24న రాజోలు మండల ప్రజాపరిషత్ మండల సర్వసభ్య సమావేశానికి హాజరయ్యారు. అదేరోజు సాయంత్రం తన స్వగ్రహమైన తాటిపాక చేరుకున్న తరువాత బ్రెయిన్ స్ట్రోక్ వచ్చింది. వెంటనే కుటుంబ సభ్యులు అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందారు. ఆయన సెప్టెంబరు 24, 2021లో రాజోలు ఎంపీపీగా బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శిగా ఉంటూ టీడీపీలో చురుకైన వ్యక్తిగా పనిచేస్తున్నారు. కేతా భౌతిక కాయాన్ని శనివారం అమలాపురం నుంచి స్వగ్రామమైన తాటిపాకకు అంబులెన్సు తీసుకువచ్చారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ శ్రీను మృతదేహంపై టీడీపీ కండువా కప్పి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి కన్నీటి పర్యాంతమయ్యారు. శ్రీను ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ పార్టీ పటిష్టత కోసం కృషి చేశారని, ఆయన మృతి పార్టీకి తీరని లోటని తెలిపారు. కుటుంబ సభ్యలకు ప్రగాడ సంతాపం తెలిపారు. రాజోలు, పి.గన్నవరం ఎమ్మెల్యేలు దేవ వరప్రసాద్, గిడ్డి సత్యనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, దంతులూరి చంటిబాబు, మాజీ జడ్పీ చైర్మన్ నామన రాంబాబు, వైఎస్ ఎంపీపీలు పొలమూరి శ్యామ్‌బాబు, యింటిపల్లి ఆనందరాజు, చాగంటి స్వామి, నాగిరెడ్డి గోపి, సూరిశెట్టి శ్రీనివాస్, సర్పంచ్ కోటిపల్లి రత్నమాల పరామర్శించిన వారిలో ఉన్నారు. ఎంపీపీ మృతి పట్ల అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ ఓ ప్రకటనలో ప్రగాఢ సంతాపం తెలిపారు. కేతా శ్రీను మృతదేహానికి ఆదివారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు.



ఎంపీపీ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మంత్రి వాసంశెట్టి సుభాష్

వ్యక్తిపై హత్యాయత్నం

కొత్తపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగుతున్న సమయంలో ఇద్దరి మధ్య జరిగిన వివాదంలో ఓ వ్యక్తిపై హత్యాయత్నం చేయగా తీవ్రగాయాలపాలయ్యాడు. వివరాల ప్రకారం... కోనసీమ జిల్లా కొత్తపేట మండలం వానపల్లి శివారు నారాయణపురానికి చెందిన మానుపాటి రాజేష్, మోడేకుర్రుకు చెందిన పితాని సతీష్ కలిసి నారాయణపురం రాజేష్‌కు చెందిన చికెన్‌షాపులో మద్యం తాగుతుండగా వ్యక్తిగత విషయాలపై సతీష్ వ్యాఖ్యలు చేసి వాగ్వాదానికి దిగడంతో కోపానికి గురైన రాజేష్ సతీష్‌పై కత్తితో దాడి చేయగా మెడకు తీవ్ర గాయమైంది. సతీష్‌కు కొత్తపేట ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్స చేసి రాజమహేంద్రవరం తరలించగా వైద్యులు కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలని సూచించారు. సమాచారంతో కొత్తపేట ఎస్ఐ సురేంద్ర ఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు.

మలకపల్లిలో ఇద్దరు బాలికల అదృశ్యం

తాళ్లపూడి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం మలకపల్లి గ్రామం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వతరగతి చదువుతున్న ఇద్దరు బాలికలు శుక్రవారం నుంచి కనిపించడంలేదని వారి తల్లితండ్రులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. మలకపల్లి హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న కండెల్లి గౌరిప్రియ, మెరిపో తేజస్విని శుక్రవారం ఉదయం యథావిధిగా పాఠశాలకు వెళ్లి సాయంత్ర ఇంటికి తిరిగిరాలేరు. వారి ఆచూకీ తెలియనందున తల్లితండ్రులు శనివారం పిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఎస్.అన్నవరంలో చోరీ

తుని రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని శివారు ఎస్.అన్నవరంలో చోరీ జరిగింది. శుక్రవారం అర్ధరాత్రి పంచాయతీ కార్యాలయం సమీపంలో ఉన్న కొప్పిశెట్టి లోకేష్ కిరాణాషాపులో షెట్టర్ పగలగొట్టి కౌంటర్‌లో ఉన్న రూ.30వేల నగదు దోచుకున్నారు. మరొకచోట స్కూటీ అపహరించారు.

బోటు పై నుంచి పడి కూలీ మృతి

కాకినాడ క్రైం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ఏటిమొగ సమీపంలోని జగన్నాథపురం ఉప్పుటేరులో బోటుపై పనిచేస్తున్న శ్రీకాకుళానికి చెందిన చీడిపల్లి పరదేశి (48) ప్రస్తుతం జగన్నాధపురం సమీపంలో నివసిస్తున్నాడు. శుక్రవారం బోటుపై పని చేస్తూ ప్రమాదవశాత్తు బోటుపై నుంచి జారి పడి గల్లంతయ్యాడు. గజ ఈతగాళ్లు గాలించినా ప్రయోజనం లేకపోయింది. పరదేశి మృతదేహం శనివారం జగన్నాధపురం సమీపంలోని ఉప్పుటేరులో తేలింది. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిత్రాడలో మహిళ అనుమానాస్పద మృతి



పీబీసీ కాలువలో మహిళ మృతదేహం

పిఠాపురం రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడ శివారు పీబీసీ కాలువలో మహిళ అనుమానాస్పద స్థితిలో మరణించింది. కాకినాడ రూరల్ మండలం ఎస్.అచ్యుతాపురం రావిశెట్టి వీధికి చెందిన యనమండ్ర లీలా సూర్యకిరణ్(38) భర్త కొంతకాలం క్రితం మరణించారు. ఆమె కుమార్తె విషయంలో ఇంట్లో గొడవ జరగడంతో 2రోజుల క్రితం ఇంటి నుంచి వచ్చేసినట్టు బంధువులు తెలిపారు. అప్పటి నుంచి వెతుకుతుండగా శనివారం ఉదయం పీబీసీ కాలువలో పడి ఉండగా పోలీసులు గుర్తించారు. ఆమె ఆత్మహత్య చేసుకుందా లేదా మృతికి ఇతర కారణాలు ఉన్నాయా అనే విషయంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో పిఠాపురం పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

పాము కాటుకు మహిళ మృతి



సత్యవతి మృతదేహం

పి.గన్నవరం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం కె.ఏనుగుపల్లిలో శనివారం పాము కాటుకు మహిళ మృతిచెందింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన సానబోయిన సత్యవతి(44) మధ్యాహ్నం ఏనుగుపల్లి లంకలో పశువులమేత కోస్తుండగా తాచుపాము కాటేసింది. సమీపంలో ఉన్న పలువురు ద్విచక్రవాహనంపై ఇంటికి తీసుకొచ్చి విషయం చెప్పారు. బంధువులు హుటాహుటిన అక్కడి నుంచి చికిత్స నిమిత్తం పి.గన్నవరం సీహెచ్‌సీ తరలించారు. అప్పటికే ఆలస్యం కావడంతో చికిత్స పొందుతూ సత్యవతి మృతి చెందింది. సత్యవతి భర్త దింపు కార్మికుడు కాగా వారికి కుమారుడు రమేష్, కుమార్తె కనకదుర్గ ఉన్నారు. బంధువులు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ బి.శివకృష్ణ తెలిపారు.

గోదావరిలో దూకి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కాపాడిన యువకులు



చికిత్స పొందుతున్న శ్రీనివాసరావు

యానాం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): యానాం-ఎదుర్లంక వారధి పై నుంచి గోదావరిలో దూకి వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన యానాంలో జరిగింది. శనివారం మధ్యాహ్నం గోదావరిలో దూకిన వ్యక్తిని చూసిన యానానికి చెందిన యువకుడు మల్లాడి వెంకట్ తమ మిత్రులతో కలిసి అక్కడే ఉన్న సీగల్స్ బోటు సహకారంతో గోదావరిలో దూకిన వ్యక్తిని కాపాడి యానాం ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అతడి వద్ద ఉన్న ఆధార్‌కార్డు ఆధారంగా కాకినాడకు చెందిన తలాటం శ్రీనివాసరావుగా గుర్తించి బంధువులకు సమాచారం ఇవ్వండంతో వారు యానాం వచ్చి శ్రీనివాసరావును కాకినాడ ఆసుపత్రికి తీసుకెళ్లారు. శ్రీనివాసరావును కాపాడిన వెంకట్, స్నేహితులను పలువురు అభినందించారు.

గర్భిణి, శిశువు మరణంపై అధికారుల విచారణ



వేలచింతలగూడెంలో వారా లక్ష్మి కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న వైద్య సిబ్బంది

గోపాలపురం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఇటీవల తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో పురుడు పోసుకుంటూ ప్రమాదవశాత్తూ తల్లి, శిశువు మృతిచెందిన విషయం విధితమే. దీనిపై జిల్లా కలెక్టర్ పీ.ప్రశాంతి ఆదేశాల మేరకు డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌వో సంధ్య, డీఐవో కోమల శనివారం విచారణ చేపట్టారు. తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం వేలచింతలగూడెం గ్రామానికి చెందిన వారా లక్ష్మి 2వ కాన్పు పురుడు పోసుకునేందుకు ఈనెల 24న మంగళవారం ఉదయం గోపాలపురం సామాజిక ఆరోగ్యకేంద్రంలో చేరింది. అయితే ప్రసూతి విభాగ మత్తు వైద్యులు 25వ తేదీ ఆసుపత్రిలో పురుడు పోసేందుకు సిద్ధం చేశారు. మత్తు మందుఇచ్చిన కొద్ది సేపటికే స్పృహ కోల్పోతున్నట్టు గమనించిన వైద్య సిబ్బంది వెను వెంటనే లక్ష్మికి కృత్రిమ ఆక్సిజన్ అందించి 108 వాహనంలో రాజమండ్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు లక్ష్మిని పరీక్షించి ప్రసవం కోసం ఆపరేషన్ చేసే సమయంలో లోపలో ఉన్న కడుపులోని శిశువుతో పాటు లక్ష్మి చనిపోయినట్టు నిర్ధారించారు. దీనిపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ చేపట్టినట్టు డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో తెలిపారు. కుటుంబసభ్యులు తెలిపిన సమాచారాన్ని కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు. అన్నదేవరపేట పీహెచ్‌సీ వైద్యురాలు స్వర్ణలత,ఆశా కార్యకర్తలు ఉన్నారు.

పిఠాపురంలో గుర్తు తెలియని మృతదేహాలు లభ్యం

పిఠాపురం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలో రెండు చోట్ల గుర్తు తెలియని వ్యక్తుల మృతదేహాలు కలకలం రేపాయి. సినిమాసెంటర్‌లోని డివైడర్ వద్ద ఒక వ్యక్తి మరణించగా, బైపాస్‌రోడ్డులోని బస్‌షెల్టర్ సమీపంలో సర్కిల్‌కార్యాలయానికి చేరువలో మరో వ్యక్తి మరణించి ఉండగా స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారి గురించి ఏ వివరాలు తెలియరాలేదు. బిచ్చగాళ్లుగా భావిస్తున్నారు. మృతదేహాలను తరలించేందుకు పోలీసులు, మున్సిపల్ సిబ్బంది చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చోరీ కేసులో నలుగురి అరెస్టు



రాజోలు పోలీసుస్టేషన్‌లో నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ నరేష్‌కుమార్

రాజోలు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా రాజోలు మండలం కూనవరంలో జరిగిన ఓ చోరీ కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేశామని రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్ శనివారం తెలిపారు. రాజోలు సర్కిల్ పోలీసుస్టేషన్ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. కూనవరానికి చెందిన ఆర్.రామకృష్ణారావుకు చెందిన శ్రీవెంకటేశ్వరారా అండ్ బాయిల్డ్ రైసుమిల్లుకు 2018 డిసెంబరులో ఆరుగురు వ్యక్తులు వచ్చారు. ఇన్‌కం ట్యాక్సు అధికారులమని చెప్పి రూ.19లక్షల నగదు, విలువైన భూమి పత్రాలు, ప్రాంసరీ నోట్లు, ఆధార్‌కార్డులు, బ్యాంకు చెక్‌బుక్కులు, బ్యాంకు పుస్తకాలను దౌర్జన్యంగా తీసుకుని కారులో పరారయ్యారు. రామకృష్ణారావు ఫిర్యాదు మేరకు రాజోలు పోలీసుస్టేషన్‌లో అప్పటి ఎస్ఐ ఎం.నాగరాజు కేసు నమోదు చేశారు. నిందితులు అప్పటి నుంచి తప్పించుకుని తిరుగుతున్నారు. 2020లో ఇదే తరహాలో తెలంగాణలోని గచ్చిబౌలీ పోలీసుస్టేషన్‌లో అరెస్టు అయి బెయిల్ విడుదలై పోలీసులకు కనపడకుండా తిరుగుతున్న మలికిపురం మండలం కేశనపల్లికి చెందిన వై.అరవింద్, గూడపల్లి పల్లిపాలేనికి చెందిన ఎస్.సందీప్, గూడపల్లికి చెందిన ఎం.మణికంఠ, పి.గన్నవరం మండలం పోతవరానికి చెందిన ఎన్.మురళీశ్రీధర్ శుక్రవారం సాయంత్రం శివకోటిలో నూతన హైవేపై ఉండగా రాజోలు ఎస్ఐ బి.రాజేష్‌కుమార్ తన సిబ్బందితో కలిసి చాకచక్యంగా పట్టుకున్నారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్టు తెలిపారు. నలుగురు నిందితులను రాజోలు సీఐ సమక్షంలో కోర్టులో హాజరు పరిచారు. కేసును చాకచక్యంగా చేధించిన పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

కేబుల్ కార్యాలయంలో అగ్నిప్రమాదం

రూ.20 లక్షల మేర నష్టం



ఆహుతైన కేబుల్ వైర్లు

అంబాజీపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం పుల్లేటికుర్రు మార్కెట్‌కు వెళ్లే దారిలో ఉన్న కొత్తపల్లి కృష్ణమూర్తి డాబాలోని కేబుల్ కార్యాలయంలో శుక్రవారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం జరిగింది. విద్యుత్‌షార్ట్‌సర్క్యూట్ కారాణంగా జరిగిన ఈ ప్రమాదంలో సిటికేబుల్‌కు సంబంధించి సెట్ ఆఫ్ బాక్సులు, యంత్ర పరికరాలు, వైర్లు, విలువైన ఆపరేటింగ్ సిస్టమ్ అగ్నికి ఆహుతయ్యాయి. సుమారు రూ.20లక్షల మేర ఆస్తి నష్టం సంభవించిందని, ఈ కేబుల్ కార్యాలయం వద్ద సుమారు 3 గ్రామాలకు టీఎస్ఎన్ ద్వారా కేబుల్ నెట్‌వర్క్‌ను అందించడం జరుగుతుందని నిర్వాహకుడు పళ్ళ సురేష్ తెలిపారు. పై అంతస్థులో ఉన్న వారికి ఏ ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. అమలాపురం అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. సర్పంచ్ జల్లి బాలరాజు, పంచాయతీ కార్యదర్శి లక్ష్మిపతి ఘటన స్థలాన్ని పరిశీలించారు.

అంతర్వేది తీరాన అగ్గిబాట పురుగులు

పర్యాటకులను కుట్టడంతో మంటలు, దురదలు



సముద్రం ఒడ్డున కనిపించిన అగ్గిబాట పురుగు

అంతర్వేది, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది సముద్ర తీరంలో అగ్గిబాట పురుగులు ప్రత్యక్షమయ్యాయి. బీచ్‌లో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు, పర్యాటకులు, జాలర్లు, మత్స్యకారులను ఈ పురుగులు తరచూ కనిపిస్తున్నాయి. ఎవరికైనా ఇవి తగిలినా, కుట్టినా ఆ భాగంలో వేడి మంటలు, దురదలు వస్తున్నాయని స్నానమాచరించేవారు వాపోతున్నారు. క్రిమికీటకాలు, అగ్గిబాట అనే విష పురుగులు కుట్టినప్పుడు దురదలు వస్తున్నాయని పర్యాటకులు వాపోతున్నారు. అంతర్వేది సాగర సంగమం వద్ద జెల్లీ ఫిష్‌లు (అగ్గిబాట) అనే విషపురుగులు రెండు రోజులుగా అధికంగా కనిపిస్తున్నాయి. వాతావరణంలో మార్పులు సంభవించినా, సముద్రంలో అలజడులు ఏర్పడ్డ ఈ విషపురుగులు ఒడ్డుకు వస్తుంటాయి. వాటిని ఎవరైనా పట్టుకున్నా, అవి మనుషులను కుట్టినా విపరీతమైన మంటలతో కూడిన దద్దుర్లు వస్తుంటాయి. ప్రమాదకర జీవి కానప్పటికీ అవి కుట్టిన చోట కొబ్బరినూనె రాసినా, ఉప్పునీటితో కడిగినా ఉపశమనం కలుగుతుంది. మరీ ఎక్కువగా దద్దుర్లు వస్తే వైద్యులను సంప్రదించాలి. సీ డ్రాగన్ ఫిష్ అని కూడా మత్స్యకారులు పిలుస్తున్నారు. శనివారం పదిమంది పైగా కుట్టడంతో పాలకొల్లు, భీమవరం ఆసుపత్రులకు వెళ్లినట్టు స్థానికులు తెలిపారు.

నరసన్న ఆలయాన్ని అభివృద్ధి చేయండి



కలెక్టర్ ప్రశాంతితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల

కలెక్టర్‌కు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ వినతి

కోరుకొండ, జూన్ 28(ఆంధ్రజ్యోతి): రానున్న పుష్కరాల నేపథ్యంలో ప్రభుత్వం మంజూరు చేసిన నిధుల నుంచి చారిత్రాత్మక కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ కలెక్టర్ పి.ప్రశాంతికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రాజమహేంద్రవరం కలెక్టర్ కార్యాలయంలో ఆమెను కలిసి విజ్ఞాపన పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నరసింహస్వామి దేవస్థానం 800 సంవత్సరాలు చరిత్ర కలిగినదని, 615 మెట్లు ఉంటాయన్నారు. ఇక్కడ ప్రతి రోజు ఉదయం, సాయంత్రం పూజలు జరుగుతాయన్నారు. ఆలయ ప్రాకార మండపం, రాజగోపురాలు, మెట్లు, కల్యాణ మండపం, అన్నదాన భవనం, గోశాల, అర్చకుల నివాసాలు, కోనేరు, ప్రదక్షిణ మార్గం, రథం, ఎలక్ట్రికల్ నీటి సరఫరా వ్యవస్థను అభివృద్ధి చేయాలన్నారు. పుష్కరాలతో రద్దీ ఎక్కువ కానుండడంతో రూ.36 కోట్ల వించ్ ట్రైన్ ఏర్పాటు చేయాలన్నారు. 25 మంది పైగా ఒకేసారి కొండపైకి తీసుకెళ్లే సామర్థ్యం ఉండాలన్నారు. 2027 మార్చి నాటికి అభివృద్ధి పనులు పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే రాపాక-చినకొండేపూడి రోడ్డుకొత్త పనులకు పరిపాలనా అనుమతులు ఇవ్వాలన్నారు. బొబ్బిల్లంక- మిర్తిపాడు రహదారిలో హైలెవెల్ బ్రిడ్జి నిర్మించాలన్నారు. గాడాల నుంచి రాయుడుపాకలు గ్రామానికి, మధురపూడి నుంచి ఉండేశ్వరపురం వరకు రోడ్లు పునః నిర్మించాలన్నారు. బొబ్బిల్లంక-మిర్తిపాడుతో బ్రిడ్జి నిర్మించాలన్నారు. తొర్రిగడ్డ, పంపింగ్ స్కీమ్‌లు పాడైన 3వ పంపును వెంటనే మరమ్మతులు చేయాలన్నారు. కాలువ అభివృద్ధి పనులు చేయాలన్నారు. వీలైనంత త్వరలో అనుమతులు మంజూరు చేసి పనులు చేపట్టాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

నేడు ఎస్సీ కమిషన్ చైర్మన్‌కు పౌరసన్మానం

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఏపీ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కొత్తపల్లి శామ్యూల్ జవహర్‌కు రాజమహేంద్రవరం ఆనంద్ రీజెన్సీ పందిరి హాలులో ఆదివారం సాయంత్రం 4గంటలకు దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో పౌరసన్మానం చేస్తున్నామని వేదిక కన్వీనర్ బోయిలపల్లి సుందరయ్య, దళిత నాయకులు తాళ్లూరి బాబు రాజేంద్రప్రసాద్, కోరుకొండ చిరంజీవి తెలిపారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఇప్పటి వరకు మాదిగ సామాజిక వర్గీయులను ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా నియమించలేదని తొలిసారిగా మాదిగలకు దక్కిన గౌరవంగా భావిస్తున్నామన్నారు. తొలుత కోటిపల్లి బస్టాండ్ నుంచి భారి ఊరేగింపు జరుగుతుందన్నారు. ఈ క్రమంలో పలువురు జాతీయ నాయకుల విగ్రహాలకు నివాళులర్పిస్తారన్నారు. ఆనంద్ రీజెన్సీలో జరిగే సత్కార సభకు మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరితోపాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పలు కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు హాజరవుతారని చెప్పారు. సభలో ఎస్సీల్లోని 62 ఉపకులాల మేధావులు, విద్యావేత్తలు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో నాయకులు తాళ్లూరి విజయకుమార్, ఖండవల్లి లక్ష్మి, నీలాపు వెంకటేశ్వరరావు, మద్దాల కొండలరావు, దారా యేసురత్నం, చాపల రాజు, తగరం సురేష్, బొర్రా చిన్ని పాల్గొన్నారు.

రాజానగరంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న బత్తుల వెంకటలక్ష్మి

రాజానగరం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం పేదలకు వరమని జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మీ అన్నారు. మండలంలో పలు గ్రామాల్లో వివిధ కారణాలతో అనారోగ్యంతో బాధపడి చికిత్స పొందిన బాధితులకు సీఎం ఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన నగదు చెక్కులను శనివారం ఆమె అందజేశారు. మండలంలోని కానవరం, తోకాడ, పాత తుంగపాడు, కొత్తతుంగపాడు, కలవచర్ల, శ్రీరాంపురం గ్రామాల్లో బాధిత కుటుంబాల ఇళ్లకు వెంకటలక్ష్మి వెళ్లి రూ.4.53 లక్షల విలువైన నగదు చెక్కులను బాధిత కుటుంబాలకు అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

అదనపు విద్యుత్ లోడ్ క్రమబద్ధీకరణకు

నెలాఖరు వరకు గడువు

అనపర్తి/సీతానగరం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): అదనపు విద్యుత్ లోడు క్రమబద్ధీకరణకు గృహ విద్యుత్ వినియోగదారులకు సగం సబ్సిడీతో ఇచ్చిన గడువు ఈనెల 30వ తేదీతో ముగియనుందని ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పీబీజే నటరాజన్, ఎన్.శామ్యూల్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక విద్యుత్ సెక్షన్ పరిధిలోని గృహ విద్యుత్ వినియోగదారులు మొదట విద్యుత్ సర్వీసును తీసుకున్నప్పుడు అప్పటికి ఉన్న లోడు ప్రకారం సర్వీస్ తీసుకున్నారని, కాలక్రమేణా ప్రతి గృహంలో ఏసీలు, వాషింగ్ మిషన్లు, గీజర్లు, గ్రైండర్లు, కూలర్‌లు, వాటర్ హీటర్లు ఏర్పాటు చేసుకున్న వారు అదనపు లోడును క్రమబద్ధీకరించుకోవాలన్నారు. ప్రస్తుతం కిలోవాట్‌కు రూ.1250 చెల్లిస్తే సరిపోతుందని ఈ అవకాశం ఈ నెల 30వరకు మాత్రమే ఉందన్నారు. గృహ వినియోగదారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు.

ఉచిత న్యాయ సేవలు పొందడం ఖైదీల హక్కు



ఖైదీలతో మాట్లాడుతున్న పీడీజే సునీత

పీడీజే సునీత

రాజమహేంద్రవరం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఉచిత న్యాయ సేవలు పొందడం ఖైదీల హక్కు అని, వాళ్ల తరఫున వాదించడానికి ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామని.. ఈ సేవలు వినియోగించుకోవాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత పేర్కొన్నారు. శనివారం ఆమె కేంద్ర కారాగాన్ని, మహిళా ప్రత్యేక కారాగారాన్ని సందర్శించారు. వసతి, సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనాలోచితంగా చేసే పనుల వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. చెడు స్నేహాలకు, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉంటే గౌరవ ప్రదమైన జీవితం లభిస్తుందన్నారు. ఖైదీలు మంచిగా పరివర్తన చెంది న్యాయబద్ధమైన జీవనశైలిని అలవరచుకోవాలని ఆమె హితవు పలికారు. ఖైదీలకు అందుబాటులో ఉన్న ఉచిత న్యాయ సేవలను ఎప్పటికప్పుడు తెలియజేయాలని, అలాగే వారి సమస్యలను డీఎల్ఎస్ఏ దృష్టికి తీసుకురావాలని పారాలీగల్ వలంటీర్లను ఆదేశించారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మీ పాల్గొన్నారు.

అండర్-14 క్రికెట్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

రాజమహేంద్రవరం కల్చరల్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలో ఇటీవల జరిగిన అండర్-14 క్రికెట్ టోర్నమెంట్(బాలురు) పోటీలలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలోని కేంద్రీయ విద్యాలయాలకు చెందిన పలు పాఠశాలల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో విజేతలుగా రాజమండ్రిలోని ఓఎన్‌జీసీ, కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు విజయం సాధించి, అక్టోబర్‌లో జరిగే నేషనల్స్‌కు అర్హత సాధించారని రాజమహేంద్రవరం కేంద్రీయ విద్యాలయం ఫిజికల్ డైరెక్టర్ సుందరరావు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అంబేద్కర్ యూనివర్సిటీ మాజీ రిజిస్ట్రార్ జి.తులసిరావు, స్థానిక కేంద్రీయ విద్యాలయ ప్రధానోపాధ్యాయుడు, సిబ్బంది విజేతలను అభినందించారు.

'రోడ్లపై చెత్త వేస్తే చర్యలు తీసుకుంటాం'

బిక్కవోలు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): రోడ్లపై చెత్త వేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో వి.శ్రీనివాస్ హెచ్చరించారు. ఇల్లపల్లి గ్రామంలో శనివారం ఆయన పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ తడి, పొడి చెత్తలకు పంచాయతీల ద్వారా డస్ట్‌బిన్‌లు సరఫరా చేశామని అందువల్ల గ్రామస్థులందరూ ఇళ్లలోని చెత్తను వేరు చేసి డస్ట్‌బిన్లలో వుంచితే పంచాయతీ పారిశుధ్య కార్మికులు వీటిని సేకరిస్తారన్నారు. డ్రైన్లలో నీరు నిల్వ వుండకుండా చూడాలని, తాగునీటి ట్యాంకులను క్లోరినేషన్ చేయాలన్నారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా వుండాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వెంట పంచాయతీ కార్యదర్శి ఎన్. వంశీరాఘవ పాల్గొన్నారు.

అవార్డుల గ్రహీతకు డీఈవో అభినందన



అనపర్తి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : తెలుగు సాహిత్య రంగంలో వరల్డ్ వైడ్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఎలైట్ బుక్ ఆఫ్ రికార్డులలో స్థానం సాధించిన అనపర్తి మండలం కుతుకులూరు ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు నక్కిన వీర రాఘవరావును జిల్లా విద్యాశాఖాదికారి కె.వాసుదేవరావు అభినందించారు. సమాజానికి, విద్యార్థులకు స్ఫూర్తినిచ్చే పాటలు రాసి రికార్డులు సృష్టించిన రాఘవరావు అభినందనీయుడని అన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎమ్ కె.విజయభారతి, ఎ.అరుణకుమారి పాల్గొన్నారు.

రివర్ ఫ్రంట్ పనులు ఆరు నెలల్లో పూర్తి



రివర్ ఫ్రంట్ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 28(ఆంధ్రజ్యోతి): రివర్‌ఫ్రంట్ పనులు ఆరు నెలల్లో పూర్తవుతాయని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. శనివారం రాజమహేంద్రవరం గోదావరి బండ్ రివర్ ఫ్రంట్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అఖండ గోదావరి ప్రాజెక్టులు ఒక చరిత్రగా నిలుస్తాయన్నారు. గోదావరి గట్టున ఉన్నప్రముఖుల విగ్రహాలు మరింత అందంగా తీర్చిదిద్ది పునఃప్రతిష్ఠ చేస్తామన్నారు. ఈ ప్రాజెక్టుల వల్ల స్థానికంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని,వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయన్నారు. రివర్ ఫ్రంట్ పనులను ప్రజలు చూసేందుకు భద్రత కారణాల రీత్యా ఇప్పుడు కుదరదని, పిల్లల జారి పడే ప్రమాదముందని, అందుకే గ్రీన్ మ్యాట్ వేసి లోపల అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే చెప్పారు. నగరాన్ని పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దేందుకు కూటమి చర్యలు చేపట్టిందని, ఇది చూసి తట్టుకోలేక తమ హయాంలో ఇలా చెద్దామనుకున్నాం, అలా చెద్దామనుకున్నాం అని ఇప్పుడు డప్పుకొట్టొదని మాజీ ఎంపీకి ఎమ్మెల్యే వాసు హితబోధ చేశారు. కార్యక్రమంలో కార్పొరేషన్ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్లతో ఎమ్మెల్యే సమావేశం

శనివారం సాయంత్రం రౌతు తాతాలు కళ్యాణ మండపంలో రేషన్ డీలర్లతో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. వార్డుల్లో నడవలేని స్థితిలో ఉన్న వారికి, వృద్ధులకు ఇళ్ల వద్దకే వెళ్లి రేషన్ సరుకులు అందించాలన్నారు. కూటమి ప్రభుత్వం నిర్ణయించిన తేదీల్లో తప్పక రేషన్ పంపిణీ జరగాలని, ఎక్కడా లోపాలు లేకుండా చూడాలన్నారు. పోర్టల్‌కు సంబంధించిన సాంకేతిక లోపాలుంటే వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి సరిచేసుకుని సేవలందించాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా రేషన్ సేవలు అందించాలన్నారు. సమావేశంలో తహశీల్దార్ పాపారావు, ఆర్ఎస్‌వో వాసు, రేషన్ డీలర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జామి కృష్ణ, బత్తిన నారాయణ, కేఎస్‌వి రామారావు, నమ్మి వెంకటేశ్వరావు, ఆర్ఎస్ రమేష్, ఆదిరాజు, 102 మంది రేషన్ డీలర్ల పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయం



మర్రిపూడిలో శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే నల్లమిల్లి

» ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి
» రంగంపేటలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

రంగంపేట, జూన్ 28(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పలు ఆయా గ్రామాల్లో జల జీవన్ మిషన్, పీఆర్ పథకం ద్వారా రూ.2.65 కోట్ల అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మర్రిపూడిలో, కోటపాడు శివారు రామేశంపేట, కోటపాడు శివారు రామకృష్ణాపురం, రంగంపేట ఎస్టీ కాలనీ, ముకుందవరం, సుభద్రంపేటలో వాటర్ ట్యాంక్, తాగనీటి కుళాయిలు, పైపులు ఏర్పాటుకు, కోటపాడు శివారు రామేశంపేటలో నిర్మించే సీసీ రోడ్లకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థుల సుస్థిర అభివృద్ధి, తాగునీటి సౌకర్యం, మంచి రహదారి వ్యవస్థ కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవిందు, జడ్పీటీసీ పేపకాయల రాంబాబు, నీలపాల త్రిమూర్తులు, టీడీపీ, బీజేపీ, జనసేన మండలాధ్యక్షులు ఎలుగుబంటి సత్తిబాబు, ఎం.సాయిరామ్, గిరజాల సత్తిబాబు, నాయకులు ఉద్దండ్రావు శ్రీను, మండవిల్లి గుప్త, ఉండవిల్లి గిరిబాబు, పోతుల చిన్ని కాపు, బలిరెడ్డి దుర్గారావు పాల్గొన్నారు.

రైతులకు ఆయిల్‌పామ్ మొక్కల పంపిణీ



సమావేశంలో మాట్లాడుతున్న ఉద్యానశాఖాధికారిణి నాగదేవిశ్రీ

రంగంపేట, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని జి.దొంతమూరు గ్రామంలో ఉద్యాన శాఖ, పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ ఆయిల్‌పామ్ కంపెనీ ఆధ్వర్యంలో రైతులకు ఆయిల్‌పామ్ మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యతిథిగా విచ్చేసిన ఉద్యానశాఖాధికారిణి ఎ.నాగదేవిశ్రీ మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగు ప్రాముఖ్యతను తెలుపుతూ, కేంద్రం, పతంజలి రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న రాయితీలను, సూక్ష్మసేద్యంలో ఇస్తున్న రాయితీలను వివరించారు. పతంజలి సంస్థ ఏజీఎం డి.రవీంద్ర మాట్లాడుతూ ఆయిల్ పామ్ తోటల ప్రాముఖ్యత, రైతులకు కంపెనీ ద్వారా అందించే సేవలు, సదుపాయాలు, పంట సాగులో ఎరువుల యాజమాన్యం, మెళకువలు, మంచి యాజమాన్య పద్ధతులు పాటించి రైతులు విజయం సాధించాలన్నారు.అనంతరం 20 హెక్టార్లకు ఆయిల్‌పామ్ మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పతంజలి ఫుడ్స్ సంస్థ డిప్యూటీ మేనేజర్ సీహెచ్.అనుతేజ్, ఫీల్డ్ ఆఫీసర్ ప్రసాద్, గ్రామ ఉద్యానవన అసిస్టెంట్ సీహెచ్ శివకామేష్, రైతులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ప్రధానోపాధ్యాయుడికి సత్కారం



పందలపాకలో బదిలీపై వెళ్లిన హెచ్‌ఎంను సత్కరిస్తున్న దృశ్యం

బిక్కవోలు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): పందలపాక గ్రామంలోని నెం-1 ప్రాథమిక పాఠశాలలో పీఎస్‌హెచ్‌ఎంగా పనిచేస్తూ బదిలీపై వెళ్లిన ఎస్. శ్రీనివాసరెడ్డిని శనివారం గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పడాల చిన బుజ్జి, గుణ్ణం శ్రీనివాసచౌదరి, విద్యార్థుల తల్లి దండ్రులు పాల్గొన్నారు.

గాడాలలో ఉపాధ్యాయులకు..

కోరుకొండ, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని గాదరాడలో మోడల్ ప్రైమరీ స్కూల్లో ఉపాధ్యాయులుగా పని చేసి బదిలీపై వేరే గ్రామాలకు వెళ్లిన మండపాక భాస్కరరావు, నాగులపాటి మూర్తిలను విద్యార్థులు, గ్రామస్థులు సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్.సుందర్రావు, హరిబోలు శ్రీనివాసు, ఎస్ఎంసీ చైర్మన్ దిండి శ్రీనివాస్ పాల్గొన్నారు.

చంద్రేడులో..

రంగంపేట, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని చంద్రేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులు కె.సునీల్, కె.హనుమంతరావు, టి.బాపిరాజు, పీవీవీఎస్ఎన్ మూర్తిలకు వీడ్కోలు, కె.శ్రీనివాసరావుకు స్వాగత సత్కార సభ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు గంట రమణబాబు మాట్లాడుతూ ఉత్తమ, ఆదర్శ విద్యాబోధన ద్వారా విద్యార్థుల హృదయాల్లో స్థానం సంపాదించుకున్న ఉపాధ్యాయులు ఎప్పుడూ గుర్తుంటారన్నారు.కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందును వినియోగించుకోవాలి

అనపర్తి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పశువులకు ప్రభుత్వం అందిస్తున్న నట్టల నివారణ మందును ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్య శాఖ ఏడీ వై.శ్రీనివాసరావు అన్నారు. శనివారం మండలంలోని దుప్పలపూడిలో నట్టల నివారణ మందు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలోని 2470 గొర్రెలకు, 110 మేకలకు నట్టల నివారణ మందును పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ సిరసపల్లి నాగేశ్వరరావు, కూటమి నాయకులు నల్లమిల్లి వెంకటరెడ్డి, మేడపాటి సుధాకరరెడ్డి, పెద్దింటి సత్యనారాయణ, పశువైద్యాధికారి డాక్టర్ రామచంద్రారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

హాస్యంపై ముళ్లపూడి చెరగని సంతకం

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నిత్యం మనకు కనిపించే వ్యక్తులు ముళ్లపూడి రచనలో పాత్రలుగా కనిపిస్తారని ఆదిత్య కళాశాల తెలుగు అధ్యాపకురాలు బీహెచ్‌వీ రమాదేవి అన్నారు. శనివారం స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగుశాఖ, కళాగౌతమి ఆధ్వర్యంలో నిర్వహించిన ముళ్లపూడి జయంతి ఉత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. హాస్యంపై ముళ్లపూడి చెరగని సంతకమని, సహజత్వానికి అద్దపట్టే విధంగా ఆయన సాహిత్యం ఉంటుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ బీవీ తిరుపణ్యం, తెలుగుశాఖాధిపతి పీవీబీ సంజీవరావు, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ వై.స్వర్ణశ్రీ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు పల్లి సుధా, జే.సుగుణ, ఎస్.రవికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అపర చాణుక్యుడు పీవీ

రాజమహేంద్రవరం కల్చరల్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): కష్టకాలంలో దేశ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించి, భారతదేశ మనుగడను సుస్థిరం చేసిన అపర చాణుక్యుడు పీవీ నరసింహరావు అని మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు అన్నారు. శనివారం పీవీ 104వ జయంతి కార్యక్రమాన్ని కోటిపల్లి బస్టాండ్ వద్ద స్వాతంత్ర సమర యోధుల పార్కులో నిర్వహించారు. ఈ సందర్భంగా రౌతు మాట్లాడుతూ పీవీ మరణానంతరం దేశం మొత్తంమీద తొలి విగ్రహాన్ని ఇక్కడ నెలకొల్పడం రాజమండ్రి వాసుల అదృష్టమన్నారు. కార్యక్రమంలో సమితి కన్వీనర్ మాదిరాజు శ్రీనివాస్, దేశిరెడ్డి బలరామనాయుడు, బెజవాడ రంగారావు, పీవీ కృష్ణారావు, దుర్వాసుల సత్యనారాయణ, రఘుపాత్రుని సాయిబాబా, గుడిపూడి సునీల్ గౌతమ్ పాల్గొన్నారు.



పీవీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఎస్సీ కమిషన్ చైర్మన్‌కు వినతి

కొవ్వూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): సగ్గొండ భాగ్యనగర్ క్లోరైడ్ ప్రైవేట్ లిమిటెడ్ ఫ్యాక్టరీని తెరిపించి కార్మికులకు న్యాయం చేయాలని ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. యూనియన్ వర్కర్స్‌కి,యాజమాన్యానికి మధ్య జరిగిన ఒప్పందాన్ని అమలు చేసి, ఫ్యాక్టరీని తెరిపించాలని కోరారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

బిక్కవోలు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): బలభద్రపురంలోని గ్రాసిం కంపెనీలో పని చేస్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన అమీర్ సింగ్ కనబడడంలేదంటూ అతడి యజమాని మట్టపర్తి శ్రీధర్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ వి.రవిచంద్ర కుమార్ వివరాల ప్రకారం.. శ్రీధర్ 50 మందితో గ్రాసింలో పనులు చేయించేవాడని అమీర్‌సింగ్ మార్చి 24న తన వద్దకు పనికి రావడంతో అతడిని కూడా పనిలో చేర్చుకుని గ్రాసింలో పనిచేయించేవాడన్నారు. ఈ ఏడాది మార్చి 12న తన ఊరు వెళ్తున్నాని చెప్పి వెళ్లాడని, ఈనెల 20 వరకూ అమీర్‌సింగ్ ఇంటికి రాకపోవడంతో అతడి తరపు లాయర్ ప్రమోద్‌కు మార్‌గాండ్ గ్రాసిం ఆఫీసుకు రావడంతో శ్రీధర్ అతని గూర్చి తోటి పనివార్లను అడిగి బిక్కవోలు పోలీసులకు ఫిర్యాదు చేశాడని, దాంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఉన్నత స్థాయికి ఎదగాలి

దివాన్‌చెరువు, జూన్ 28(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు క్రమ శిక్షణ, బాధ్యత, సేవాభావంతో భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఏఎస్పీ ఎంబీఎం మురళీకృష్ణ అన్నారు. సంపత్‌నగరంలోని రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్లో విద్యార్థుల నాయకత్వ పదవీ స్వీకార వేడుక శనివారం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఏఎస్పీ మాట్లాడుతూ సదుపాయాలు తక్కువగా ఉన్న రోజుల్లోనే తానెంతో కష్టపడి చదివి ఈ స్థాయికి చేరుకున్నానన్నారు. నేటి విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ప్రయోజనం పొందాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ టీకే విశ్వేశ్వరరెడ్డి, డైరెక్టర్ టి.స్వరూప్‌రెడ్డి, ప్రిన్సిపాల్ టీవీడీ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

6శాతం వడ్డీతో రైతులకు భూపరిహారం



సమావేశంలో పాల్గొన్న స్పెషల్ డిప్యూటి కలెక్టర్ భాస్కరరెడ్డి

సీతానగరం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని పురుషోత్తపట్నంలో ఏర్పాటుచేసిన పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోయి నేటి వరకు నష్టపరిహారం అందుకోని రైతులకు 6శాతం వడ్డీతో పరిహారం అందించనున్నట్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భాస్కరరెడ్డి తెలిపారు. శనివారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రామచంద్రపురం పీఏసీఎస్‌లో తహశీల్దార్ ఎ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో రైతులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మాట్లాడుతూ 2017లో పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకంలో భూములందించిన రైతులు రూ.28 లక్షల పరిహారం తీసుకోలేదని 2014 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం అందించాలని రైతులు కోరారని గుర్తుచేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు పరిహారం అందుకోని రైతులకు 6శాతం వడ్డీతో పరిహారం అందించడానికి ప్రభుత్వం అంగీకరించిందని, ఎకరానికి సుమారు రూ.40 లక్షలు చెల్లిస్తుందని తెలిపారు. దీనిపై సమావేశానికి హాజరైన రైతులు సానుకూలంగా స్పందించారు.

ఉజ్బెకిస్తాన్ విద్యార్థులకు జీఎస్‌ఎల్‌లో క్లినికల్ శిక్షణ

రాజానగరం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఉజ్బెకిస్తాన్‌లో వైద్య విద్యనభ్యసిస్తున్న 40 భారతీయ విద్యార్థులు స్థానిక జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో ఈ నెల 30 నుంచి పది రోజుల పాటు క్లినికల్ శిక్షణ ఇవ్వనున్నారు. ఈ శిక్షణలో తష్కెంట్ స్టేట్ మెడికల్ యూనివర్శిటీ, బుఖారా స్టేట్ మెడికల్ ఇనిస్టిట్యూట్‌లో చదువుతున్న వారు ఉంటారు. జీఎస్ఎల్ స్మార్ట్ ల్యాబ్ నియో వైట్ కోట్ మెంటార్ సంయుక్తంగా మెడికోస్ క్లినికల్ బూట్ క్యాంపు నిర్వహిస్తున్నాయి.. ఏ సమయంలో ఏమి జరిగినా ఎదుర్కోవడానికి సైనిక శిబిరాల్లో ఇచ్చే శిక్షణను బూట్ క్యాంపు అంటారు. ఉజ్బెకిస్తాన్ ఆరోగ్య విద్య మంత్రిత్వ శాఖ, జీఎస్ఎల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ అండ్ హాస్పటల్స్ నియో ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ లిమిటెడ్ సంస్థ మధ్య కుదిరిన ఎంవోయూ ప్రకారం ఈ వర్క్ షాపు ఏర్పాటు చేశామని జీఎస్ఎల్ ఇంటర్నేషనల్ అకాడమిక్ అఫైర్స్ సీఈవో డాక్టర్ ఎన్.గోవిందరాజు, నియో మెడికల్ అండ్ టెక్నాలజీస్ డైరెక్టర్ దివ్యరాజ్ ప్రకటించారు. ఈ ఒప్పందం ప్రకారం వైద్య విద్యలో నైపుణ్యాల పెంపుదల కోసం విజ్ఞాన మార్పిడిగా ఉజ్బెకిస్తాన్ నుంచి జీఎస్ఎల్‌కు ప్రొఫెసర్లు, డాక్టర్లు, విద్యార్థులు వస్తారు. అలాగే ఇక్కడి వారు అక్కడికి వెళ్లనున్నారు.

విద్యార్థులకు సంసిద్ధత కార్యక్రమాలు నిర్వహించాలి

బిక్కవోలు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఒకటి, రెండు తరగతుల విద్యార్థులకు సంసిద్ధత కార్యక్రమాలు నిర్వహించాలని బిక్కవోలు మండల విద్యాశాఖాధికారి సీహెచ్‌వీవీ సత్యనారాయణ ఉపాధ్యాయులకు సూచించారు. మెళ్లూరులోని మోడల్ ప్రాథమిక పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. బడిఈడు పిల్లలందర్నీ బడిలో చేర్పించాలని ప్రధానోపాధ్యాయుడు కె.సత్తిరెడ్డికి సూచించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్లను విద్యార్థులందరికీ అందించాలన్నారు.

ప్రతిభావంతులకు ప్రోత్సాహకాల అందజేత

రాజమహేంద్రవరం కల్చరల్ జూన్ 28(ఆంధ్రజ్యోతి): స్థానిక దానవాయిపేటలోని ఎస్‌కేవీటీ ప్రభుత్వ పాఠశాలలో పూర్వ విద్యార్థుల సంఘం, ఎస్‌కేవీటీ అల్యుమ్ని వారు స్కూలులో 1వ తరగతి నుంచి 10వ తరగతుల్లో ఉత్తమ మార్కులు సాధించిన 30మంది విద్యార్థులకు పుస్తకాలు, 10వ తరగతి పరీక్షల్లో, 550 కన్నా అధిక మార్కులు వచ్చిన ముగ్గురు విద్యార్థులకు, ఒక్కొక్కరికి రూ.వెయ్యి నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో అమెరికాలో స్థిరపడిన పూర్వ విద్యార్థి హోతా శాండిల్య, ప్రధానోపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, అన్నపూర్ణ, అరుణ్, రవి, పద్మజ పాల్గొన్నారు.

'ఆదర్శ'లో గ్రాడ్యుయేషన్ డే

గోకవరం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లిలో ఆదర్శ ఫార్మసీ కళాశాల ప్రాంగణంలో శనివారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. కళాశాల్లో నాలుగేళ్లు, రెండేళ్లు ఫార్మసీ విద్యను పూర్తి చేసుకున్న విద్యార్థులు ముఖ్య అతిథుల చేతుల మీదుగా డిగ్రీ పట్టాలను అందుకున్నారు. ఈ సందర్భంగా అతిథులను ఆదర్శ విద్యా సంస్థల చైర్మన్ ప్రగళ్లపాటి కనకరాజు సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ పి.నాగమణి, ప్రిన్సిపాల్ త్రినాథరావు, కోఆర్డినేటర్ ప్రగళ్లపాటి శ్రీనివాస్, తెలుగుదేశం పార్టీ నాయకులు పాలూరి బోస్, దాసరి తమ్మన్నదొర, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్


(రాజమహేంద్రవరం)

శ్యామల	: 28 ఇయర్స్ లేటర్
సూర్యమినీ	: ఎఫ్-1 ది మూవీ
సూర్యప్యాలస్	: కన్నప్ప
స్వామి	: కుబేర
శివజ్యోతి	: కుబేర
అనుశ్రీ(సాయికృష్ణ)	: కన్నప్ప
రాజా	: కన్నప్ప
ఊర్వశి	: 8 వసంతాలు
రంభ	: హౌ టు ట్రెయిన్ యువర్ డ్రాగన్
మేనక	: సింగిల్
అప్సర	: కన్నప్ప
కుమారి	: ----
అశోక	: కన్నప్ప
వీఎస్ మహల్(నామవరం)	: కన్నప్ప
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: కన్నప్ప
వెంకటసూర్య(కడియం)	: కన్నప్ప
సత్యగౌరి (అనపర్తి)	: కుబేర
సూర్యశ్రీ (అనపర్తి)	: కన్నప్ప
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: కన్నప్ప
రామకృష్ణ(కోరుకొండ)	: ఏస్
గీతాసినిమాస్ (సీతానగరం)	: ఏస్
శ్రీనివాస (గోకవరం)	: కన్నప్ప
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: కుబేర
లలితామహాల్(రంపచోడవరం)	: కన్నప్ప
నవయుగ(చింతూరు)	: కుబేర










జూలై 1న సీఎం చంద్రబాబు కొవ్వూరు రాక

సీఎంవో నుంచి సమాచారం
ఏర్పాట్ల కోసం అధికారులను అప్రమత్తం చేసిన కలెక్టర్

రాజమహేంద్రవరం/కొవ్వూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వచ్చే నెల 1న కొవ్వూరు నియోజకవర్గంలో పర్యటించనున్నారు. చంద్రబాబు స్వయంగా ఒక కుటుంబానికి ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్ పంపిణీ అందజేస్తారు. అదే సమయంలో పీ4 పథకం కింద మార్గదర్శి కోసం అక్కడ సభ నిర్వహిస్తారు. ఇదే మండలంలోని దొమ్మేరు లేదా కాపవరం, తాళ్లపూడి మండలం మలకపల్లి గ్రామాల్లో గ్రామ సభ ఉండే అవకాశం ఉంది. ఈనేపథ్యంలో తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను అప్రమత్తం చేశారు. శనివారం రాత్రి సీఎంవో నుంచి ముఖ్య కార్యదర్శి పీఎస్ ప్రద్యుమ్న, ముఖ్య మంత్రి కార్యక్రమాల సమన్వయకర్త పెందుర్తి వెంకటేష్, కలెక్టర్ ప్రశాంతితో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. సీఎం ప్రోగ్రాం ఏర్పాట్లు, ఇతర అంశాలపై వారు దిశానిర్దేశం చేశారు. పెన్షన్ పంపిణీ, మార్గదర్శి కుటుంబాలతో ముఖాముఖీ, భద్రతా ఏర్పాట్లు, గ్రామసభ తదితర అంశాలపై రూట్‌మ్యాప్ సిద్ధం చేసుకోవాలని సూచించారు. కాగా సీఎం పర్యటన నేపథ్యంలో అధికారులు శనివారం రాత్రి పలు ప్రాంతాల్లో పర్యటించారు. కొవ్వూరులోని వాత్సల్య వృద్ధాశ్రమాన్ని జేసీ ఎస్.చిన్నరాముడు, ఆర్డీవో రాణి సుస్మిత సందర్శించారు. అనంతరం దొమ్మేరు, మలకపల్లి గ్రామాల్లో సీఎం పర్యటనకు సంబంధించి కొన్ని స్థలాలను పరిశీలించారు.

పర్యాటక వెలుగు



టెంట్ సిటీ, బోట్ ఫెస్టివల్ (నమూనా చిత్రాలు)



ప్రకృతి అందాలకు.. సహజ సౌందర్యాలకు నెలవు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా. ఒకపక్క వయ్యారాలు పోతూ రారమ్మని పిలిచే గోదావరి.. మరోపక్క తనివి తీరని తీరం అందాలు.. వీటి నడుమ ఒంపుసొంపుల మడ అడవులు.. పచ్చని కొబ్బరి చెట్లు..మండువా లోగిళ్లు.. పంచా రామాల దివ్యక్షేత్రాలు.. ఇలా ఒకటేంటి ఉమ్మడి జిల్లా అందాలు వర్ణించడానికి మాటలు చాలవు.. ఇన్ని అందాలున్న ఉమ్మడి జిల్లాలో పర్యాటకుల తాకిడి ఇప్పటికీ అంతంతమాత్రమే. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో పర్యాటకరంగానికి కొత్త కళ తెచ్చేందుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. తాజాగా రూ.737 కోట్లతో రెండు సంస్థలతో ఒప్పందం కుదుర్చుకోగా, పర్యాటకశాఖ తరపున బోట్ ఫెస్టివల్, బీచ్ ఫెస్టివల్, టెంట్ హౌస్‌లతో కట్టిపడేసేందుకు సన్నాహాలు మొదలుపెట్టింది.

- ఉమ్మడి జిల్లాలో పర్యాటక, ఆతిథ్య రంగానికి కొత్త కళ
- సర్కారు శ్రద్ధతో హోటళ్లు, రిసార్టుల నిర్మాణానికి కంపెనీల రాక
- కోనసీమలో రూ.650 కోట్లతో తాజ్ చైతన్య సంస్థ రిసార్టులు, అమ్యూజ్‌మెంట్ పార్కు
- కాకినాడలో రూ.87 కోట్లతో తాజ్ ఎస్వీఎస్ సంస్థ హోటల్, కన్వెన్షన్ సెంటర్
- ప్రభుత్వంతో ఒప్పందాలు పూర్తి చేసుకున్న సంస్థలు
- అటు కాకినాడలో బీచ్ ఫెస్టివల్, కోనసీమలో బోట్ ఫెస్టివల్‌కు ఏర్పాట్లు
- రాజమహేంద్రవరంలో పర్యాటకులకు కొత్త అనుభూతి ఇచ్చేలా టెంట్ సిటీ

(కాకినాడ- ఆంధ్రజ్యోతి)

విశాఖ తర్వాత రాష్ట్రంలో పర్యాటకరంగానికి అత్యంత ఆదరణ ఉన్న జిల్లా ఉమ్మడి తూర్పు గోదావరి. కానీ గత వైసీపీ ప్రభుత్వం అరాచక పాలనతో పర్యాటక రంగం పూర్తిగా పడకేసింది. కొత్తగా సదుపాయాల కల్పన మాటేమోగానీ ఉన్న సదుపాయాలను గాలికి వదిలేయడంతో పూర్తిగా ఎక్కడికక్కడ పర్యాటక ప్రదేశాలు కొరగాకుండా పోయాయి. అటు పర్యాటక పెట్టుబడులు అయితే ఆ ప్రభుత్వ హయాంలో చిల్లిగవ్వ కూడా రాలేదు. ఈ నేపథ్యంలో గ్రహణం పట్టిన పర్యాటక రంగానికి కొత్త కళ తెచ్చేలా సీఎం చంద్రబాబు ఊపిరిలూదుతున్నారు. అద్భుత అవకాశాలున్న ఉమ్మడి జిల్లాలో పెట్టుబడులు ఆహ్వానిస్తూనే.. పర్యాటకులను అలరించేలా ప్రభుత్వం తరపున సైతం రకరకాల ఈవెంట్లను నిర్వహించేందుకు కార్యాచరణ చేపట్టారు. అందులో భాగంగా ఈ రంగంలో పెట్టుబడులు పెట్టేవారికి రకరకాల ప్రోత్సాహకాలతో పెద్దపీట వేయాలని నిర్ణయించారు. ఈమేరకు ముందుకు వచ్చిన కంపెనీలతో అమరావతిలో శుక్రవారం నిర్వహించిన పర్యాటక సదస్సులో ప్రభుత్వంతో ఒప్పందం కూడా కుదుర్చుకున్నారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాకు రూ.737 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ప్రధానంగా కోనసీమ జిల్లాలో రూ.650 కోట్ల పర్యాటక పెట్టుబడులు పెట్టడానికి తాజ్‌చైతన్య ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థ ముందుకు వచ్చింది. ఆ సంస్థ శుక్రవారం పర్యాటక శాఖతో ఒప్పంద పత్రాలు మార్చుకుంది. ఈ పెట్టుబడులతో అమలాపురం, చుట్టుపక్క ప్రాంతాల్లో రిసార్టులు, అమ్యూజ్‌మెంట్‌పార్కు నిర్మించనున్నట్టు ఒప్పంద పత్రాల్లో పేర్కొన్నారు. వాస్తవానికి కేరళ తరహాలో ఉండే కోనసీమ అందాలు చూసేందుకు ఎందరో పర్యాటకులు ఇక్కడకు వస్తున్నారు. కానీ సరైన స్టార్ హోటళ్లు, ఎంటర్‌టైన్‌మెంట్ లేదు. ఈ నేపథ్యంలో వీటిని అందుబాటులోకి తీసుకురావడానికి తాజ్ చైతన్య ఇన్‌ఫ్రా కంపెనీ ముందుకు వచ్చింది. ఈ సదుపాయాలు అందుబాటులోకి వస్తే సుదూర ప్రాంతాల నుంచి కోనసీమకు వచ్చే పర్యాటకులు కొన్నిరోజులు ఇక్కడే గడుపుతారని ప్రభుత్వం భావిస్తోంది. తద్వారా రకరకాల వ్యాపార లావాదేవీలకు ఊతం అందడంతోపాటు స్థానికులకు సైతం ఆదాయం వస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. అలాగే కాకినాడలో రూ.87 కోట్లతో స్టార్‌హోటల్ గదులు, వాటితో పాటు భారీ కన్వెన్షన్ సెంటర్ నిర్మాణానికి తాజ్ ఎస్వీఎస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. ప్రస్తుతం కాకినాడలో స్టార్‌హోటళ్ల సంఖ్య చాలా తక్కువగా ఉన్నాయి. అటు భారీ ఈవెంట్ల నిర్వహణకు సరైన కన్వెన్షన్ సెంటర్ లేదు. ఈ నేప థ్యంలో హైదరాబాద్ హైటెక్స్ తరహాలో కన్వెన్షన్ సెంటర్ నిర్మాణానికి ఆ కంపెనీ ముందుకు వచ్చింది. కోనసీమలో నిర్మించే రిసార్టులు, అమ్యూజ్‌మెంట్ పార్కు ద్వారా వెయ్యి మందికి, కాకినాడలో నిర్మించే హోటల్, కన్వెన్షన్ సెంటర్ ద్వారా 500 మందికి ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించబడతాయి. అలాగే ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో 13 చోట్ల గోదావరి తీరం, గోదావరి కాలువల వెంబడి అడ్వంచర్ టూరిజం సదుపాయాలకు ప్రైవేటు కంపెనీల నుంచి ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించింది.

అటు టెంట్ సిటీ.. ఇటు పండగలు..

ఒకపక్క పెట్టుబడులు రాబట్టి ఉమ్మడి జిల్లాలో పర్యాటక సదుపాయాలు, ఆహ్లాదం పెంచడం ఒకెత్తుకాగా, పర్యాటకశాఖ తరపున సైతం ప్రభుత్వం పలు టూరిస్టు కార్యకలాపాలు నిర్వహించాలని నిర్ణయించింది. అందులోభాగంగా త్వరలో కోనసీమ జిల్లాలో గోదావరి బోట్ ఫెస్టివల్ నిర్వహించబోతోంది. వందలాది బోట్లకు పడవ పోటీలు, అందులో సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాలు ఏర్పాటు చేయడానికి క్యాలెండర్ రూపొందించింది. అలాగే కాకినాడ బీచ్ ఫెస్టివల్‌ను మూడు రోజులపాటు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు కసరత్తు చేస్తోంది. ఫుడ్ ఫెస్టివల్, గేమ్స్, సాహస జలక్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, మ్యూజికల్ నైట్స్ వంటివి ఏర్పాటుచేయబోతోంది. అలాగే దిండిలో హౌస్‌బోట్స్, ఫ్లోటింగ్ రెస్టారెంట్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. నదిలో తిరుగుతూ, ఒకచోట ఆగుతూ అందులో కుటుంబంతో కలిసి డిన్నర్, లంచ్ చేసేలా ఆధునిక, విలాసవంతమైన బోట్లను రప్పిస్తోంది. ఇదికాకుండా 12 మంది పర్యాటకులు కూర్చుని ప్రయాణించేలా హైస్పీడ్ ఎఫ్ఆర్‌పీ బోట్ క్రూయిజ్‌ను నది, సముద్రంలో తిప్పడానికి వీలుగా ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇదంతా ఒకెత్తయితే రాజమహేంద్రవరం నగరంలో గోదావరి తీరాన 40 గదులతో టెంట్ సిటీని ఏర్పాటు చేయబోతోంది. సాధారణంగా ఇక్కడకు వచ్చే పర్యాటకులు గోదావరికి దూరంగా ఎక్కడో హోటళ్లలో బస చేస్తారు. ఇందుకు వేలల్లో ఖర్చవుతుంది. మరోపక్క రద్దీ రోజుల్లో హోటల్ గదులు కూడా దొరకవు. ఈనేపథ్యంలో తక్కువ ఖర్చు.. ఎక్కువ గోదావరి అందాలు చూసేలా 40 గదులు నిర్మించాలని ప్రతిపాదించింది. ఇందులో పడక గదులు, వాష్‌రూంలు, ఎంటర్‌టైన్‌మెంట్ కూడా అందుబాటులో ఉంటుంది. వాస్తవానికి ఈటెంట్ సిటీ అయోధ్య, గుజరాత్‌లోని కెవాడియా ప్రాంతాల్లో ప్రసిద్ధి చెందాయి. దూరప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు అక్కడి పర్యాటక శాఖ ఈటెంట్ సిటీల్లో బస అందుబాటులోకి తీసుకువచ్చింది. దీన్ని అధ్యయనం చేసిన రాష్ట్ర పర్యాటక శాఖ బాపట్ల జిల్లా సూర్యలంక బీచ్ వద్ద రూ.98 కోట్లతో 50 టెంట్ రూం సిటీని ఏర్పాటుకు నిర్ణయించింది. పర్యాటకులకు తక్కువ ధరల్లో అన్ని రకాల వసతులతో వీటిని ఇవ్వబోతోంది. అచ్చం ఇదే తరహాలో రాజమహేంద్రవరంలో కూడా ఈ తరహా టెంట్ సిటీని ఏర్పాటుచేయాలని నిర్ణయించింది.

'ధర' హాసం!

అరటితోపాటు కొబ్బరి మార్కెట్ ధరలు అనూహ్యంగా పుంజుకోవడంతో రైతుల ఆనందానికి అవధుల్లేవు. కర్పూర అరటి ధర గతంకంటే రెట్టింపు పలుకుతుండడం, ఆ రకం కర్పూర సాగు చేసిన రైతులకు పంట పండినట్టయింది. అలాగే కొబ్బరిలో కూడా ధరల పెరుగుదల రానున్న రోజుల్లో మరింత పుంజుకోవచ్చని అంచనా. ఇక కురిడీ కాయకు అద్భుత ధర పలుకుతోంది.

(అమలాపురం- ఆంధ్రజ్యోతి)

- అరటి, కొబ్బరి రైతుల్లో ఆనందం
- కర్పూర, చక్రకేళీ గెల రూ.600 పైనే
- ఉత్పత్తి తగ్గడంతో పెరిగిన డిమాండ్
- కొబ్బరికీ రికార్డు స్థాయిలో పెరుగుదల
- కురిడీ వెయ్యింటికీ రూ.27 వేలు
- పచ్చికాయ మాత్రం రూ.19వేల లోపే

కర్పూర.. గతంకంటే రెట్టింపు

ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని గోదావరి నదీ పరీవాహక లంక గ్రామాల్లో అరటి సేద్యం చేస్తున్న రైతులకు ఈసారి పంట పండినట్టయింది. రావులపాలెం అరటి మార్కెట్ నుంచి నిత్యం వేలాది కర్పూర, చక్రకేళీ సహా వివిధ రకాల అరటి ఉత్పత్తులు వివిధ రాష్ట్రాలతోపాటు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలకు ఎగుమతి అవుతున్నాయి. ప్రస్తుతం కర్పూర రకానికి మంచి డిమాండ్ ఉంది. ఈ ఏడాది జనవరిలో కర్పూర అరటి గెల రూ.120 నుంచి రూ.250 వరకు ధర పలికింది. మే, జూన్ నెలలో కర్పూర రకం గెల ఒక్కోటీ రూ.300 నుంచి రూ.600 వరకు ధర పలుకుతుండడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. చక్రకేళీ కంటే కర్పూర రకానికే ధర పెరిగింది. గతంలో కర్పూర రకానికి మార్కెట్ పూర్తిగా పడిపోవడంతో రైతులు ఆ రకం పంటపై పెద్దగా దృష్టిపెట్టలేదు. దాంతో సాగు తగ్గిపోయింది. ఈ కారణంగా కర్పూరానికి డిమాండ్ పెరిగింది. రావులపాలెం మార్కెట్ నుంచి నెలకు 7వేల నుంచి 8,500 వరకు అరటి గెలలు ఎగుమతి అయ్యేవి. జనవరి నెలలో మార్కెట్‌యార్డు నుంచి 9 వేల నుంచి 10 వేల వరకు అరటిగెలల విక్రయాలు జరిగేవి. ప్రస్తుతం కర్పూర రకం వినియోగం పెరగడంతో ఒడిశా, విశాఖపట్నం, హైదరాబాద్, ఖమ్మం వంటి ప్రాంతాలకు అరటి ఎగుమతులు పెరిగాయి. చక్రకేళీ అరటిగెల ప్రస్తుతం రూ.400 నుంచి రూ.700 వరకు ధర పెరగడంతో రైతులకు లాభసాటిగా మారింది. రానున్న శ్రావణ మాసం, వినాయకచవితి, పండుగల సీజన్‌లో మరింత ధరలు పెరిగే అవకాశం ఉంది.

రికార్డు స్థాయిలో కురిడీ ధరలు

కొబ్బరి రైతులకు ఈసారి దశ తిరిగిందనే చెప్పాలి. ధరల పెరుగుదల కొనసాగుతుండడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. దీనికితోడు నిల్వచేసిన కురిడీ కొబ్బరి ధరలు వెయ్యింటికీ రూ.27వేల వరకు ధర పలకడం రికార్డు నెలకొల్పింది. ప్రధానంగా ఇతర రాష్ట్రాల్లో కొబ్బరి ఉత్పత్తులు తగ్గిపోతుండడంతో గోదావరి జిల్లాల నుంచి ఎగుమతి అయ్యే ఉత్పత్తులకు మంచి డిమాండ్ లభిస్తోంది. పచ్చికాయ కొబ్బరి ధర వెయ్యి కాయ మాత్రం రూ.18వేల నుంచి రూ.19 వేల వరకు ధర పలుకుతున్నట్టు కొబ్బరి రైతులు చెబుతున్నారు. రానున్న శ్రావణమాసం, వినాయక చవితి వంటి పర్వదినాల సమయంలో వీటి ధరలు పెరుగుతాయని పేర్కొంటున్నారు. ముఖ్యంగా గోదావరి జిల్లాల నుంచి 50 లారీలకు పైగా మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాలకు ఎగుమతులు అవుతున్నాయి. అయితే గతంకంటే ప్రస్తుతం కోనసీమ జిల్లాలో కొబ్బరి ఉత్పత్తులు ధరలు పెరిగినప్పటికీ ఉత్పత్తులు మాత్రం తగ్గుముఖం పట్టడం రైతులను ఒకింత నిరాశకు గురిచేస్తోంది. ప్రస్తుతం కొత్త కొబ్బరి క్వింటాల్ రూ.23,500, రెండో రకం కొత్తకొబ్బరి రూ.20 వేలు, కురిడీ కొబ్బరి పాతరకంలో గండేరా వెయ్యి కాయ రూ.27 వేలు, గటగటా వెయ్యి రూ.25 వేలు,కురిడీ కొబ్బరి కొత్తరకంలో గండేరా వెయ్యికాయ రూ.25వేలు, గటగటా వెయ్యి రూ.23 వేలు ధర పలుకుతున్నాయి. నీటికాయ రూ. 18 వేల నుంచి రూ.19వేల మధ్య ధర పలుకుతోంది. మొత్తం మీద అరటి, కొబ్బరి ధరల పెరుగుదల రైతుల్లో ఉత్సాహాన్ని నింపింది.

సహకార సంఘాల రికార్డులను క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయండి : కలెక్టర్

రాజమహేంద్రవరం రూరల్, జూన్28 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల రికార్డులను క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం సహకార అభివృద్ధి కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని సహకార సంఘాల రికార్డులను తనిఖీలుచేసి కార్యకలాపాలు నిర్వహించని మనుగడలో లేని సొసైటీల విషయంలో ప్రభుత్వ మార్గదర్శకాలు, కోఆపరేటివ్ సొసైటీ నిబంధనల మేరకు చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు. నిబంధనలు పాటించకుండా, పనిచేయడంలో వైఫల్యం కలిగిన సొసైటీలను రద్దుచేసి, నగదు లావాదేవీలు, అనుబంధ రికార్డులు, ఇతర కార్యకలాపాలకు చెందిన రికార్డులు సీజ్ చేయాలని ఆదేశించారు. రికార్డులని పరిశీలించి తిరిగి పునరుజ్జీవానికి అవకాశం ఉన్న సొసైటీల కార్యకలాపాలు మనుగడలోనికి తీసుకొని రావడంపై సమగ్ర నివేదిక అందజేయాలని కలెక్టర్ సూచించారు. అంతర్జాతీయ సహకార సంవత్సరాన్ని పురస్కరించుకుని వివిధ కార్యక్రమాలు నిర్వహించేందుకు జూలై నుంచి డిసెంబర్ వరకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. జిల్లా సహకార అధికారి ఎంవీ వెంకటరమణ మాట్లాడుతూ జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల వ్యవస్థలో నూరు శాతం కంప్యూటరైజేషన్ చేయడం జరిగిందని తెలిపారు. సొసైటీ సభ్యులకు సంబంధించి 89 శాతం ఈకేవైసీ పూర్తిచేశామని తెలపగా, మిగిలిన 11శాతం కూడా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టంచేశారు. గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలు అందించే డీసీసీబీ బ్యాంక్ కౌలు రైతులకు రుణాలు ఎందుకు ఇవ్వడంలేదని, కారణాలు వివరించాలని కలెక్టర్ ప్రశ్నించారు. సమావేశంలో జేసీ ఎస్.చిన్నరాముడు, జిల్లా మార్కెటింగ్ అధికారి ఎం.సునీల్‌వినయ్, జిల్లా మత్స్యశాఖఅధికారి టి.నిర్మలకుమారి, కాకినాడ, ఏలూరు డీసీసీబీ అధికారులు పాల్గొన్నారు.

కట్టకపోతే.. రద్దే!

- పేదల ఇళ్ల లబ్ధిదార్లకు నోటీసులు
- డిసెంబరులోపు నిర్మించుకోకపోతే లోన్లు రద్దని హెచ్చరిక
- జిల్లాలో 10,794 ఇళ్ల లక్ష్యం.. ఇప్పటికి 6,325 పూర్తి
- 4,469 ఇళ్లు ఇంకా పెండింగ్
- అదనపు సొమ్ము ఇచ్చినా ముందుకు రాని లబ్ధిదారులు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వ అనాలోచన విధానాల వల్ల వేలాది పేదలకు కేటాయించిన కాలనీల్లో ఇళ్ల నిర్మాణం ఇబ్బందిగా మారింది. ప్రస్తుత ప్రభుత్వం అధికార్లకు టార్గెట్లు ఇవ్వడంతో రాత్రీపగలూ పనిచేసి, కొంత లక్ష్యం నెరవేరినా అనేకమంది పేదలు ముందుకు రాకపోవడంతో ఇళ్ల నిర్మాణాలు సాగడం లేదు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం లబ్ధిదార్లకు అదనపు ఆర్థిక సహాయం చేసినా చాలా ఇళ్ల నిర్మాణం చేపట్టడం లేదు. దీంతో పేదల కాలనీల్లో ఇళ్లు నిర్మించుకోని వారికి గృహనిర్మాణశాఖ అధికారులు నోటీసులు ఇస్తున్నారు. డిసెంబరులోపు ఇళ్లను నిర్మించుకోకపోతే లోన్లను రద్దు చేస్తామని హెచ్చరించడం గమనార్హం. జిల్లాలో ఉన్న కాలనీల్లో ఈనెలాఖరుకి 10,794 ఇళ్ల నిర్మాణం పూర్తిచేయాలని ప్రస్తుత ప్రభుత్వం లక్ష్యం పెట్టింది. కానీ గత ప్రభుత్వం సెంటుంపావు స్థలంలో ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు ఇవ్వడంతో ఎక్కువమంది లబ్ధిదారులు కట్టుకోలేకపోయారు. దాంతో ప్రస్తుత ప్రభుత్వం డ్వాకా మహిళలకు కొంత సొమ్ము అదనంగా ఇవ్వడంతోపాటు ఇతరులకు రూ. 15 వేల నుంచి 35 వేల వరకూ అదనపు సహాయం చేసింది. అయినా చాలామంది లబ్ధిదారులు ముందుకు రాలేదు. ఇక ఈనెలాఖరుకి జిల్లాలో 10,794 ఇళ్లు నిర్మించాలని లక్ష్యం పెట్టుకోగా, ఇప్పటికి 6,325 పూర్తయ్యాయి. ఇంకా 4,469 పెండింగ్ ఉన్నాయి. వీటిలో చాలావరకూ అసలు పనులే ప్రారంభించలేదు. వీరికి డబ్బు చాలడం లేదనే కారణంతో ఎవరూ ముందుకు రావడంలేదు. ఈ నేపథ్యంలో అధికారులు వారికి నోటీసులు ఇస్తున్నారు. డిసెంబర్‌లోపు అందరూ సొంతంగా నిర్మించుకోవాలని, లేకపోతే ఇంటి లోను రద్దు అవుతుందని హెచ్చరిస్తున్నారు. కానీ ఆయా కాలనీల్లో లబ్ధిదార్లకు కేటాయించిన స్థలాలను మాత్రం రద్దు చేయరు. కానీ వారు ఇల్లు కట్టుకోవడానికి మంజూరు చేసిన రుణం రద్దు చేస్తారు. దీంతో లబ్ధిదార్లలో కదలిక వస్తే మరిన్ని ఇళ్ల నిర్మాణం సాగుతుంది. కాగా జిల్లాలో మండలాల వారీ లక్ష్యాలను విధించారు. అనపర్తిలో 1036 ఇళ్లు కేటయించగా, 685 జూన్ నెలాఖరుకి నిర్మించాలని లక్ష్యంగా పెట్టారు. కానీ 177 మాత్రమే పూర్తయ్యాయి. ఇంకా 508 పెండింగ్‌లో ఉన్నాయి. బిక్కవోలులో 908 ఇళ్లు కేటాయించగా, 695 జూన్ నెలాఖరుకి నిర్మించాలని లక్ష్యంగా పెట్టారు. కానీ 209 మాత్రమే పూర్తయ్యాయి. ఇంకా 486 పెండింగ్‌లో ఉన్నాయి. సీతానగరంలో 269కి 90 పూర్తయ్యాయి. 179 పెండింగ్‌లో ఉన్నాయి. కొవ్వూరులో 460కి 163 పూర్తి, 297 పెండింగ్. చాగల్లులో 385కి 145 పూర్తి, 240 పెండింగ్‌లో ఉన్నాయి. రాజమహేంద్రవరం రూరల్‌లో 295కి 112 పూర్తి, 183 పెండింగ్‌లో ఉన్నాయి. కొవ్వూరు అర్బన్‌లో 595కి 228 పూర్తి 367 పెండింగ్‌లో ఉన్నాయి. ఉండ్రాజవరంలో 306కి 134 పూర్తి, 172 పెండింగ్‌లో ఉన్నాయి. రంగంపేటలో 304కి 136 పూర్తి, 168 పెండింగ్. నిడదవోలు అర్బన్‌లో 223కి 113 పూర్తి, 110 పెండింగ్. కడియంలో 219కి 111 పూర్తి, 108 పెండింగ్. తాళ్లపూడిలో 284కి 155 పూర్తి, 129 పెండింగ్. పెరవలిలో 138కి 83 పూర్తి, 56 పెండింగ్. గోకవరంలో 211కి 135 పూర్తి, 76 పెండింగ్. కోరుకొండలో 266కి 171 పూర్తి, 95 పెండింగ్. రాజానగరంలో 289కి 189 పూర్తి, 100 పెండింగ్. నిడదవోలులో 338కి 225 పూర్తి, 113 పెండింగ్‌లో ఉన్నాయి. దేవరపల్లిలో 699కి 495 పూర్తి, 204 పెండింగ్. గోపాలపురంలో 474కి 349 పూర్తి, 125 పెండింగ్. నల్లజర్లలో 563కి 415 పూర్తి, 148 పెండింగ్. రాజమండ్రి అర్బన్‌లో 3096కి 2491 పూర్తి, 605 పెండింగ్‌లో ఉన్నాయి.

3,362మందికి అదనపు ఆర్థిక సహాయం చేసినా...

జిల్లాలో 3,362 మందికి ఇంటి నిర్మాణం కోసం అదనపు ఆర్థిక సహాయం చేశారు. మొత్తం రూ.7.76 కోట్లు అదనపు ఆర్థిక సహాయంగా ఇచ్చారు. అందులో ఇప్పటికి కేవలం 1030 పూర్తి అయ్యాయి. మిగతావి కదలేదు. వీరికి కూడా ఇప్పుడు నోటీసులు ఇస్తున్నారు.

గర్భిణి, శిశువు మరణంపై అధికారుల విచారణ



లక్ష్మి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న వైద్య సిబ్బంది

గోపాలపురం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఇటీవల తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో పురుడు పోసుకుంటూ ప్రమాదవశాత్తూ తల్లి, శిశువు మృతి చెందిన విషయం విదితమే. దీనిపై జిల్లా కలెక్టర్ పీ.ప్రశాంతి ఆదేశాల మేరకు డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో సంధ్య, డీఐవో కోమల శనివారం విచారణ చేపట్టారు. తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం వేలచింతలగూడెం గ్రామానికి చెందిన వారా లక్ష్మి 2వ కాన్పు పురుడు పోసుకునేందుకు ఈనెల 24న మంగళవారం ఉదయం గోపాలపురం సామాజిక ఆరోగ్యకేంద్రంలో చేరింది. అయితే ప్రసూతి విభాగ మత్తు వైద్యులు 25వ తేదీ ఆసుపత్రిలో పురుడు పోసేందుకు సిద్ధంచేశారు. మత్తు మందు ఇచ్చిన కొద్ది సేపటికే స్పృహ కోల్పోతున్నట్టు గమనించిన వైద్య సిబ్బంది వెను వెంటనే లక్ష్మికి కృత్రిమ ఆక్సిజన్ అందించి 108 వాహనంలో రాజమండ్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు లక్ష్మిని పరిక్షించి ప్రసవం కోసం ఆపరేషన్ చేసే సమయంలో లోపల ఉన్న నవజాత శిశువుతో పాటు లక్ష్మి చనిపోయినట్టు నిర్ధారించారు. దీనిపై కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ చేపట్టినట్టు డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో తెలిపారు. కుటుంబ సభ్యులు తెలిపిన సమాచారాన్ని కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు. అన్నదేవరపేట పీహెచ్‌సీ వైద్యురాలు స్వర్ణలత వెంట ఉన్నారు.

నల్సా పథకాలు ప్రజలకు చేరువకావాలి

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత



సదస్సులో ప్రసంగిస్తున్న పీడీజే సునీత

రాజమహేంద్రవరం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): జాతీయ లీగల్ సర్వీసెస్ అథారిటీ(నల్సా) అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు చేరువ కావాల్సిన అవసరం ఉందని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత పేర్కొన్నారు. డీఎల్ఎస్ఏ, జిల్లా యంత్రాంగం సంయుక్తంగా నల్సా వారి 'పేదరిక నిర్మూలన, మానవ అక్రమ రవాణా', లీగల్ సర్వీసెస్‌లో కొత్త మాడ్యూల్‌లపై ఏర్పాటు చేసిన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అంద జేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో ఉండే ఏడు న్యాయ సేవల పథకాలను ఇప్పుడు 14కు నల్సా పెంచిందన్నారు. జిల్లా స్థాయిలో డీఎల్ఎస్ఏ ద్వారా, మండల స్థాయిలో ఎంఎల్ఎస్ఏ ద్వారా అర్హులైన వారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తున్నామన్నారు. నేటి సమాజంలో చిన్నారులు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై చిన్నారులు ప్రదర్శించిన నృత్య రూపకాలు ఆలోచింపజేశాయని చెప్పారు. డీఎల్ఎస్ఏ ఏర్పాటు, కార్యకలాపాలు, న్యాయసహాయం, వివిధ చట్టాలను సంస్థ కార్యదర్శి శ్రీలక్ష్మి వివరించారు. అనంతరం డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో డ్వాక్రా సంఘాలకు రుణాల నిమిత్తం రూ.5కోట్లు, మెప్మా ఆధ్వర్యంలో రూ.3.60 కోట్ల చెక్కులను, దివ్యాంగులకు వినికిడి యంత్రాలు, వీల్‌చైర్లు, బ్రెయిలీ లిపి పుస్తకాలు, స్త్రీ నిధి కింద కెమెరా కొనుగోలుకు రూ.1 లక్ష చెక్కును పీడీజే అందజేశారు. తొలుతగా మెప్మా, డీఆర్‌డీఏ, వైద్య ఆరోగ్య, ఐసీ డీఎస్, పోలీస్, డీఎల్ఎస్ఏ, వ్యవసాయ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ని తిలకించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ నరసింహకిషోర్, పీడీ మూర్తి, కార్పొరేషన్ ఏసీ రామలింగేశ్వర్ పాల్గొన్నారు.

8

రవాణా వాహనాల ఫిట్‌నెస్ విధానం ఉపసంహరించాలి

1న చలో రాజానగరం..
అఖిల పక్ష నేతల పిలుపు

ఆశా వర్కర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

రాజమహేంద్రవరం సిటీ, జూన్28(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఆశావర్కర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా వైద్యఆరోగ్య అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో వైద్యఆరోగ్యశాఖ పరిధిలో వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేయడానికి 30 మంది ఆశాకార్యకర్తలు అవసరమన్నారు. అనపర్తిలో 3, బిక్కవోలులో 1, రంగంపేటలో 2, రాజమహేంద్రవరం రూరల్‌లో 4, కడియంలో 3, రాజానగరంలో 2, కోరుకొండలో 2, సీతానగరంలో 2, గోకవరంలో 1, దేవరపల్లిలో 3, నల్లజర్లలో 2, తాళ్లపూడిలో 1, కొవ్వూరు రూరల్‌లో 1, చాగల్లులో 1, పెరవలిలో 1, ఉండ్రాజవరంలో 1 పోస్టు భర్తీకి ఈనెల 28 నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు స్థానిక పీహెచ్‌సీల్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు ప్రక్రియ, అర్హతలు జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఈస్ట్‌గోదావరి.ఎన్ఐసీ.ఇన్‌లో పొందుపరిచినట్టు తెలిపారు.

ఆపదలో ఉన్నవారికి అండగా ఉంటా : ఎమ్మెల్యే



బాధిత కుటుంబానికి నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

గోపాలపురం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ అండగా నిలబడతానని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. వేలచింతల గూడెంకి చెందిన గర్భిణి వారా లక్ష్మీ ప్రసవ సమయంలో మృతిచెందిన సంగతి తెలిసిందే. అయితే తల్లి, తండ్రిని కొల్పోయిన వారా గీతామాధురికి ఎమ్మెల్యే శనివారం రూ.నాలుగు లక్షల నగదును అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను ఎన్నో కష్టనష్టాలను చవిచూశానన్నారు. పదవి ఏ వ్యక్తికి అలంకారం కాదని, తనను నమ్మిన ప్రజలకు సేవ చేసినప్పుడే దానికి తగ్గ ఆత్మసంతృప్తి కలుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు కొర్లపాటి రాము, పిన్నమనేని చినబాబు, కొర్లపాటి అన్నవరం, ఇల్లూరి రాము, జగదీష్, ఆర్అంబ్ఎం ఫౌండేషన్ అధినేత గంటా మధుకృష్ణ, మండల అధ్యక్షుడు రొంగల సత్యనారాయణ, జ్యేష్ట శ్రీధర్, దుగ్గిరాల శ్రీను, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

'ప్రతిభ ఉంటే ఏ రంగంలోనైనా రాణించొచ్చు'



విద్యార్థినులకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

గోపాలపురం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఏ విద్యార్థికైనా తనలో ఉన్న ప్రతిభకు పట్టుదల, సంకల్పం ఉంటే ఏ రంగంలోనైనా రాణించవచ్చని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. జగన్నాథపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో దాత అల్లూరి గంగరాజు (తమ్ము) 8వ వర్ధంతి సందర్భంగా 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన ముమ్మిడి లక్ష్మీదుర్గాకు ప్రథమ బహుమతిగా అల్లూరి గంగరాజు భార్య ఇందిరాదేవి రూ.25వేలు, ద్వితీయస్థానం సాధించిన పారేపల్లి భార్గవికి దాత పొడూరి వెంకటరమణ రూ.10 వేలును ఎమ్మెల్యే శనివారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం సమాజం సాంకేతిక పరిజ్ఞానంలో పోటీపడుతున్న తరుణంలో అంది వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. 2006 నుంచి ప్రతి ఏటా దాత అల్లూరి గంగరాజు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు ఆర్థికసాయం అందించడం అభినందించదగ్గ విషయమన్నారు. అనంతరం పలువురు మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎస్ఎస్ఎస్ లక్ష్మీకుమారి, స్కూల్ కమిటీ చైర్మన్ రమ్యభార్గవి, టీడీపీ నాయకులు సురేశ్, పసుమర్తి గంగాధర్, పసుమర్తి పెద్దబ్బులు, పొడూరి రఘురామ్, తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సత్కారం



బదిలీ ఉపాధ్యాయులను సత్కరించిన దృశ్యం

ఉండ్రాజవరం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): తాడిపర్రు హైస్కూల్‌కు చెందిన ప్రధానోపాధ్యాయురాలు కే.సరోజినితో పాటు ఉపాధ్యాయులు ఎం. విజయలక్ష్మి, వై. వెంకటస్వామి, వి. భానురేఖ, ఎం. పట్టాభి, జీజే రవికాంత్ బదిలీ అయ్యారు. వారిని పాఠశాల సిబ్బంది, గ్రామానికి చెందిన నాయకులు శనివారం సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కరుటూరి నరేంద్ర ప్రసాద్, కూటమి నాయకులు జీ. సత్యనారాయణ, ఏ. గోపాలకృష్ణ, వీ. సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు. అలాగే ఈ పాఠశాలకు ఉపాధ్యాయులు జీ.శ్రీనివాసరావు, ఎస్. తాతారెడ్డి, ఆర్ఎస్ఆర్ ఫణి, కే. గీతాశైలజ, డీ. అజితకుమారి బదిలీపై వచ్చి ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు.

రాయితీపై విద్యుత్‌లోడ్ పెంచుకోవడానికి 30తో గడువు పూర్తి

కొవ్వూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగదారులు రాయితీపై అధిక లోడ్‌ను పెంచుకోవడానికి ఈ నెల 30వ తేదీతో గడువు ముగుస్తుందని విద్యుత్‌శాఖ పట్టణ ఏఈ డీ.జగదీశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యం

● మెగా జాబ్‌మేళాలో ఎమ్మెల్యే ముప్పిడి
● 117 మంది ఉద్యోగాలకు ఎంపిక



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మనిషికి కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధించగలడని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో శనివారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ జె. సునీత అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం మెగా డీఎస్సీ తీస్తానని చెప్పి నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. గత ప్రభుత్వంలో రాష్ట్రానికి పరిశ్రమలు పెట్టడానికి ముందుకు వచ్చిన వారంతా భయపడి పక్క రాష్ట్రాలకు వెళ్లిపోయారన్నారు. అందువల్ల యువతకు ఉపాధి లేక నిరుద్యోగులుగా మారిపోయారన్నారు. మంత్రి నారా లోకేష్ ఎన్నికల ముందు పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు ఈ 5 సంవత్సరాలలో 20 లక్షల ఉద్యోగాలు ఇవ్వాలని నిర్ణయించుకున్నారని, అందుకోసమే జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నియోజకవర్గంలో మెగా జాబ్‌మేళా నిర్వహించి సుమారు 700 మందికి ఉద్యోగ నియామకపత్రాలు అందించామన్నారు. ప్రతి మూడునెలలకు ఒకసారి జాబ్‌మేళా నిర్వహిస్తున్నామన్నారు. ఉద్యోగాలకు ఎంపిక కాని వారికి కొవ్వూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ జె.సునీత మాట్లాడుతూ జాబ్‌మేళాలో మొత్తం 16 కంపెనీలకు సంబంధించి 750 ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించగా, 1167 మంది అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, ఇందులో 117 మంది ఉద్యోగాలకు అర్హత సాధించారన్నారు. కార్యక్రమాన్ని దగ్గరుండి పర్యవేక్షించిన సూరపనేని చిన్నిని ప్రిన్సిపాల్, ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, ద్విసభ్య కమిటీ సభ్యుడు కంటమణి రామకృష్ణారావు, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు, మాజీమున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, జడ్పీటీసీ బొంతా వెంకటలక్ష్మి, కౌన్సిలర్ పాలూరి నీలిమ, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పెనుమాక జయరాజు, బీజేపీ నేత బోడపాటి ముత్యాలరావు, ఏపీఎస్ఎస్‌డీసీ డీఎస్‌డీవో వీడీజీ మురళీ, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన అవసరం

● సీనియర్ సివిల్ జడ్జి జీవీఎల్ సరస్వతి



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి జీవీఎల్ సరస్వతి

కొవ్వూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : గుడ్, బ్యాడ్ టచ్‌లపై ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి జీవీఎల్ సరస్వతి అన్నారు. రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు మండల లీగల్ సెల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం కొవ్వూరు అభ్యాస పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె గుడ్ టచ్,బ్యాడ్ టచ్‌ల గురించి విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయులు, బంధువులు పిల్లలను తాకరాని చోట తాకినట్లయితే వెంటనే తల్లికి తెలియజేయాలన్నారు. తల్లితండ్రులు తమ పిల్లలు ఏవిధంగా ప్రవర్తించాలో తెలియజేయాలన్నారు. న్యాయవాదులు ఎం నాగమణి, ఎం రఘురామ్, ఎం. శిరీష, ఎస్ శ్రీనివాసరావు, ఎం శ్రీవల్లీ, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



రాంబాబు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

తాళ్లపూడి, జూన్28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నదేవరపేటకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త గొరిజాల వెంకటప్రసాద్ (జీవీ) సోదరుడు గొరిజాల రాంబాబు ఇటీవల మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరావు ఆ కుటుంబ సభ్యులను శనివారం కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా రాంబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అలాగే ప్రక్కిలంకకు చెందిన టీడీపీ నేత ముప్పిడి రాంబాబు అకాల మరణానికి చింతిస్తూ ఆ కుటుంబ సభ్యులను కలిసి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈయనతోపాటు ముప్పిడి రవి, నామన పరమేశ్వరరావు, తదితర నాయకులు ఉన్నారు.

పార్టీని బలోపేతం చేసినవారికి అవకాశం ఇద్దాం

● టీడీపీ సీనియర్ నేత, నల్లజర్ల మాజీ సర్పంచ్ శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ సీనియర్ నేత శ్రీనివాసరావు

నల్లజర్ల, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వ హయాంలో టీడీపీని బలోపేతం చేసిన నిమ్మలపూడి వరప్రసాద్‌ను నల్లజర్ల గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా కొనసాగించాలని ఆ పార్టీ సీనియర్ నేత, నల్లజర్ల మాజీ సర్పంచ్ యలమాటి శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం రాత్రి నల్లజర్లలోని వేణుగోపాల స్వామి కల్యాణ మండపంలో గ్రామ టీడీపీ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో ఎన్నో అక్రమ కేసులు పెట్టినప్పటికీ ధైర్యంగా ఎదుర్కొంటూ.. అలాగే గోపాలపురం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా మద్దిపాటి వెంకటరాజును అధిష్ఠానం ప్రకటించినప్పటి నుంచి ప్రతి కార్యక్రమాన్ని పార్టీ ఆదేశాల మేరకు కొనసాగించాడని, అందువల్ల వరప్రసాద్‌కే గ్రామ పార్టీ అధ్యక్షుడిగా కొనసాగించాలని సమావేశానికి వచ్చిన నాయకులు, కార్యకర్తలు ముక్తకంఠంతో తీర్మానించారు. కార్యక్రమంలో కండెపు వెంకటరత్నం, వల్లూరి సత్తిపండు, విడియాల శ్రీను,గెడపు శ్రీను,వల్లూరి నారాయణ, ఘంటా శ్రీను, పేరం పద్దయ్య పాల్గొన్నారు.

ఎస్సీ కమిషన్ చైర్మన్‌కు వినతి



జవహర్‌కు వినతిపత్రం అందజేస్తున్న భాగ్యనగర్ క్లోరైడ్ ఫ్యాక్టరీ కార్మికులు

కొవ్వూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): సగ్గొండ భాగ్యనగర్ క్లోరైడ్ ప్రైవేట్ లిమిటెడ్ ఫ్యాక్టరీని తెరిపించి కార్మికులకు న్యాయం చేయాలని ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. యూనియన్ వర్కర్స్‌కి, యాజమాన్యానికి మధ్య జరిగిన ఒప్పందాన్ని అమలుచేసి, ఫ్యాక్టరీని తెరిపించాలని కోరారు. అలాగే ఉద్యోగులకు న్యాయం చేయాలని యూనియన్ ప్రెసిడెంట్ పెందుర్తి వెంకట్రాయుడు అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ కోటిచుక్కల రాము, పీవీవీవీవీ రామకృష్ణ, సోమరాజు, రత్నాజీ, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులు గుర్తించండి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి అనురాధ

కొవ్వూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్‌అదాలత్‌లో పెండింగ్ కేసులు ఎక్కువ గుర్తించి పరిష్కరించాలని కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి ఎం. అనురాధ సూచించారు. శనివారం కొవ్వూరు సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులతో పెండింగ్ కేసులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ కొవ్వూరు కోర్టుల పరిధిలో పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసులపై పోలీస్‌స్టేషన్ల వారీగా ఆరా తీశారు. పెండింగ్‌లో ఉన్న కేసులను గుర్తించి ఎక్కువ సంఖ్యలో రాజీచేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. కొవ్వూరు డీఎస్పీ జీ. దేవకుమార్, ఎస్‌ఐలు కె.శ్రీహరిరావు, కే.జగన్మోహనరావు, రామకృష్ణ, సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులు సామూహిక సెలవు



ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

నిడదవోలు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించుకునేందుకు సెలవు మంజూరు చేయాలంటూ మండలానికి చెందిన పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవో వీఎస్‌వీఎల్ జగన్నాథంకు వినతిపత్రం అందజేసి, వారంతా సామూహిక సెలవు పెట్టారు.

ఇద్దరు బాలికలు అదృశ్యం

తాళ్లపూడి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మలకపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న ఇద్దరు బాలికలు శుక్రవారం నుంచి కనిపించడం లేదని వారి తల్లితండ్రులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో చదువుతున్న కండెల్లి గౌరీప్రియ, మెరిపో తేజస్విని శుక్రవారం ఉదయం యథావిధిగా పాఠశాలకు వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగిరాలేదు. దీంతో వారి ఆచూకీ కోసం వారి తల్లితండ్రులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

ధాన్యం సొమ్ములు చెల్లించాలని వినతి



తహసిల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

ఉండ్రాజవరం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూర్యారావుపాలెం, పసలపూడికి చెందిన రైతులు రైతుసేవా కేంద్రాల ద్వారా అమ్మిన ధాన్యానికి సొమ్ములు చెల్లించాలని శనివారం స్థానిక తహశీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ రబీలో మిల్లులకు ధాన్యాన్ని పంపి రెండు నెలలైనా నేటికీ ఖాతాల్లో సొమ్ములు జమ కాకపోవడంతో అవస్థలు పడుతున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో సూర్యారావుపాలెం, పసలపూడి రైతులు, తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ పద్ధతిలో వ్యవసాయం చేస్తే అధిక దిగుబడులు



మాట్లాడుతున్న ఏరువాక అధికారులు

కొవ్వూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ సీజన్‌లో రైతులు వరి దిగుబడి పెంపునకు శాస్త్రీయ పద్ధతిలో ఎరువుల వినియోగాన్ని అవలంభిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏరువాక కోఆర్డినేటర్, శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్‌వీ నరసింహారావు అన్నారు. అంతర్జాతీయ సహకార సంవత్సరాన్ని పురస్కరించుకుని పశివేదల రంగరాయ విశాల సహకార పరపతి సంఘంలో శనివారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులు అధికంగా వినియోగించినట్టయితే పంటలు నష్టపోతాయన్నారు. సహాయ సంచాలకులు జయరామలక్ష్మి మాట్లాడుతూ మట్టి పరీక్షలు చేయించుకుని నేలలో ఏ పోషక లోపం ఉందో గుర్తించి తదనుగుణంగా ఎరువులు వాడుకోవాలన్నారు. మండల వ్యవసాయాధికారి ఏ.గంగాధర్ మాట్లాడుతూ యూరియా వాడకంలో జిల్లా మూడోస్థానంలో ఉందని, ఫలితంగా కేంద్ర ప్రభుత్వంపై సబ్సిడీల భారం పెరుగుతుందన్నారు. జిల్లా సహకార అధికారి ఎం. వెంకటరమణారావు సేంద్రియ ఎరువుల వాడకంతో నేలలో జీవశక్తి పెరిగి, రసాయన ఎరువుల వాడకం తగ్గుతుందన్నారు. జిల్లా సహకార ఆడిట్ అధికారి జగన్నాథరావు మాట్లాడుతూ నకిలీ వాడకం వల్ల పంట దిగుబడులు తగ్గడమే కాకుండా భూమి సారవంతం కూడా దెబ్బతింటుందన్నారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి కరుటూరి శ్రీనివాస్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరరావు మృతి పార్టీకి తీరనిలోటు

● పార్థివ దేహాన్ని మోసిన ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు



వెంకటేశ్వరరావు పాడె మోస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి, కుమారుడు అనిల్, తదితరులు



నివాళి అర్పిస్తున్న ఎస్సీ కమిషన్ చైర్మన్

దేవరపల్లి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): గౌరీపట్నం మాజీసర్పంచ్, టీడీపీ సీనియర్ నేత అంద్రూ వెంకటేశ్వరరావు మృతి పార్టీకి తీరని లోటని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. వెంకటేశ్వరరావు అనారోగ్యంతో బాధపడుతూ శనివారం ఉదయం మృతిచెందారు. ఈవిషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మద్దిపాటి గౌరీపట్నంలోని ఆయన స్వగ్రామం వెళ్లి పార్థివ దేహాన్ని మోశారు. అలాగే ఎస్సీ రాష్ట్ర కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్ వచ్చి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు అంద్రూ అనిల్ దేవరపల్లి మండల టీడీపీ అధ్యక్షుడిగా, తూర్పుగోదావరి జిల్లా క్వారీ క్రషర్స్ యాజమానుల సంఘం అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. అలాగే గోపాలపురం నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులను టీడీపీ నేతలు గద్దే వెంకట్రామారావు, గన్నమని హరికృష్ణ, కొఠారు ధ్రువకాంత్, ముళ్లపూడి దొరాజీ, బలుసు సత్యనారాయణ, పెనుమత్స సుబ్బరాజు, కాట్రగడ్డ శ్రీనివాస్ చౌదరి, కరుటూరి ధనుంజయుడు, ముమ్మిడి సత్యనారాయణ, బళ్లా సూర్యచక్రం, ఎంపీడీవో రాజారావు, జనసేన నేత అనిశెట్టి గంగరాజు, తదితరులు పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి.

'వరలక్ష్మి రైస్‌మిల్లుపై చర్యలు తీసుకోవాలి'



దేవరపల్లిలో మిల్లు వద్ద ఆందోళన చేస్తున్న స్థానికులు

దేవరపల్లి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లిలోని వరలక్ష్మి రైస్‌మిల్లు నుంచి విపరీతంగా పొల్యూషన్ రావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులైన జాజిమొగ్గల సత్యప్రకాశ్, బొడపాటి లక్ష్మి, గుంటూరి వరలక్ష్మి, కృష్ణ, తదితరులు శనివారం మిల్లు ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధాన్యం ఆడిన వ్పుడు మిల్లుకి ఇరువైపులా ఉన్న ఇళ్లల్లోకి ఊక, తూగరు వచ్చేస్తోందని తెలిపారు. దీంతో చిన్నారులు, ముసలివాళ్లు తీవ్రఅనారోగ్యానికి గురవుతున్నారని వారంతా వాపోయారు. ఇకనైనా అధికారులు రైస్‌మిల్లుపై చర్యలు తీసుకోవా లని డిమాండ్ చేశారు. ఆందోళన చేసిన వారిలో జాజిమొగ్గల సూర్యారావు, బందుల రాజ్‌కుమార్, వీ.రాజు, కుక్కల వెంకటేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొవ్వూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): దేచర్ల విద్యుత్ సబ్‌స్టేషన్ ఏజీఎల్ ఫీడర్ వార్షిక మరమ్మతుల కారణంగా ధర్మవరం, పెనకనమెట్టలో ఈ నెల 30వ తేదీన విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్టు విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్. నారాయణ అప్పారావు తెలిపారు. ఆ రోజు ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, ప్రజలు, వినియోగదారులు సహకరించాలన్నారు. వ్యవసాయ విద్యుత్ ఉదయం నాలుగు నుంచి ఏడుగంటల వరకు, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి ఆరుగంటల వరకు సరఫరా చేయనున్నట్టు విద్యుత్‌శాఖ కొవ్వూరు రూరల్ ఏఈ సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు.

రవాణా వాహనాల ఫిట్‌నెస్ విధానం ఉపసంహరించాలి

● 1న చలో రాజానగరం విజయంతం చేయండి
● అఖిల పక్ష సమావేశంలో నేతలు పిలుపు



రాజమహేంద్రవరంలో ఐక్యత చాటుతున్న అఖిల పక్షం నేతలు

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి):రవాణా వాహనాల ఫిట్‌నెస్ (బ్రేక్) రవాణా శాఖ అధికారుల నుంచి ప్రైవేట్ సంస్థలకు కూటమి ప్రభుత్వం అప్పజెప్పడం వల్ల రవాణా కార్మికులకు ఎదురౌతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని వెంటనే ఆ విధానాన్ని ఉపసంహరించుకోవాలని అఖిల పక్ష నేతలు డిమాండ్ చేశారు. శనివారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఆనంద్ రీజెన్సీ పందిరి హాలులో ఐఎన్‌టీ యూసీ జిల్లా అధ్యక్షుడు వాసంశెట్టి గంగాధర్, మాజీ డిప్యూటీ మేయర్ బాక్స్ ప్రసాద్ నేతృత్వంలో జరిగిన అఖిలపక్ష సమాశంలో మాజీ ఎంపీలు ఉండవల్లి అరుణ్‌కుమార్, మార్గాని భరత్‌రామ్, సీపీఎం జిల్లా కార్యదర్శి టీ. అరుణ్, డీసీసీ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి, ఆర్‌పీసీ వ్యవస్థాపక అధ్యక్షుడు మేడా శ్రీనివాస్, సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, కార్మిక సంఘాల నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది గడచినా రవాణా రంగ కార్మికులకు ఎటువంటి న్యాయం జరగలేదన్నారు. రవాణా కార్మికులకు ఈ ఫిట్‌నెస్ విధానం వల్ల బాధ ఉండబట్టే ఇంత మంది వచ్చారని త్వరలోనే దీనిపై సానుకూల నిర్ణయం ప్రభుత్వం నుంచి వస్తుందని ఆశిస్తున్నట్టు ఉండవల్లి అన్నారు. రవాణా కార్మికులకు అవసరమైన న్యాయ సహాయం చేయడానికి తాను ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటానన్నారు. ఏపీలో ప్రైవేటీకరణ విధానాన్ని ఉపసంహరించుకునే వరకు ఆందోళన చేయడానికి అందరూ సంసిద్ధం కావాలని మార్గాని పిలుపునిచ్చారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై కూడా వైసీపీ నిర్వహించే పోరాటాలలో తమకు కలిసి రావాలని కోరారు. కన్వీనర్లు వాసంశెట్టి గంగాధర్, బాక్స్ ప్రసాద్ మాట్లాడుతూ ఏ రాజకీయ పార్టీ తరపున తాము ఈ ఆందోళన చేపట్టడం లేదని, అందర్నీ కలుపుకుని జాయింట్ యాక్షన్ కమిటీగా ఏర్పడి ఉద్యమాన్ని మొదలు పెట్టామన్నారు. ప్రభుత్వం నుంచి సానుకూల నిర్ణయం వెలువడితే జూలై ఒకటో తేదీన చేపట్టిన చలో రాజానగరం కార్యక్రమాన్ని ఉపసంహరించుకోవడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఆ రోజు నిర్వహించే చలో రాజానగరం విజయవంతం చేయాలని తీర్మానించారు.

సమావేశంలో ఏజీటీయూసీ నాయకుడు రెడ్డి రమణ, వైసీపీ నాయకులు వైకేఎల్, కేఎల్ నరసింహారెడ్డి, డీవీ రెడ్డి, ఐఎన్‌టీయూసీ ఉభయ రాష్ట్రాల ఆర్గనైజింగ్ సెక్రటరీ టీ.నారాయణరావు, ముచ్చకర్ల సత్యనారాయణ, పాలేపల్లి నాగేశ్వరరావు, సప్పా ఆదినారాయణ,ఆటో, చిన్నకారు ఓనర్ కం డ్రైవర్స్ గూడ్స్ ఆటోలు, మినీ వ్యాన్లు డ్రైవర్లు, ఓనర్లు , తదితరులు పాల్గొన్నారు.